
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 1 ఆగస్టు 2025
****
గరిష్ఠం 33.0
కనిష్ఠం 24.4



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585 (297.4350)	2,43,409	2,43,409
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.02 (3.94)	464.69	644.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.291 (40.2110)	2,14,653	2,14,653

చికెన్ ధరలు	లైవ్ : రూ.144	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.245



విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూపు

- వ్యవసాయ కొత్త కనెక్షన్లకు భారీగా డిమాండ్
- ఉమ్మడి జిల్లా సమీక్షలో ప్రస్తావించిన మంత్రి కోమటిరెడ్డి
- నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 20వేల వరకు డిమాండ్
- సామగ్రి కొరతతో రైతుల అవస్థలు
- ప్రత్యేక దృష్టిసారిస్తేనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం

వ్యవసాయ సీజన్ ఆరంభం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏటేటా పెరుగుతున్నా, కనెక్షన్ల కోసం రైతులు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నా విద్యుత్‌శాఖ నుంచి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, సర్వీసు కనెక్షన్లు మంజూరు కావడంలేదు. కొత్త సర్వీసులకు అవసరమైన విద్యుత్ స్తంభాలు సైతం సకాలంలో అందించకపోవడంతో రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాలో విద్యుత్ పరికరాల సరఫరా జాప్యంపై అధికారులను ప్రశ్నించడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

నల్లగొండతో పాటు సూర్యాపేట జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, వారందరికీ వేగంగా కనెక్షన్లు ఇవ్వాలని ఇటీవల నల్లగొండ జిల్లాలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో డిమాండ్‌పై టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీతో తాను సైతం చర్చించి త్వరగా పనులయ్యేలా చూస్తానని ఇన్‌చార్జిమంత్రి లక్ష్మణ్‌కుమార్ సైతం ప్రకటించినా పరిస్థితి ఎక్కడి గొంగళి అక్కడిలానే ఉంది. తాజాగా, శుక్రవారం ఇంధనశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ సమస్యను మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏడాదిగా భారీగా పెండింగ్

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఏడాది కాలంగా వర్క్ ఆర్డర్లు మంజూరైనా సామగ్రి లేక పెండింగ్‌లో ఉన్నాయి. రెండు జిల్లాల్లో సుమారు 20వేల వరకు వ్యవసాయ ఆధారిత నూతన కనెక్షన్లు పెండింగ్‌లో ఉండగా, నల్లగొండ జిల్లాలో 10వేల వరకు వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో సైతం దాదాపు ఇదే పరిస్థితి ఉంది. రెండు వీటిల్లో రెండు జిల్లాల్లో ఆరువేల పైచిలుకు కనెక్షన్లకు వర్క్ ఆర్డర్లు ఇచ్చినా సామగ్రి ఇవ్వాల్సి ఉంది. వీరంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సామగ్రి లేకపోవడంతో సరఫరా చేయలేకపోతున్నామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. అయితే వచ్చే సమాగ్రిని సిఫారసు లేఖలు ఉన్నవారికి, పైరవీలతో వచ్చినవారికి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్టోర్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ ఏబీ కేబుళ్లు, ట్రిపుల్‌ఏ-కండక్టర్లు, త్రీఫేజ్ 26కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవని అధికారులను సమాధానం వస్తోంది. రెండు జిల్లాల్లో వర్క్ ఆర్డర్లు వచ్చిన కనెక్షన్లకు సంబంధించి సైతం సామగ్రి ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాలకు సుమారు దాదాపుగా 4లక్షల మీటర్ల ఎల్టీ ఏబీ కేబుల్ అవసరం. అదేవిధంగా ట్రిపుల్‌ఏ-కండక్టర్లు 4.50లక్షల మీటర్లకు, త్రీఫేజ్ 26 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 1,100 అవసరం కాగా, అవి అందుబాటులో లేవని సమాధానం వస్తోంది. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి 100 కేవీ, 50కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 300వరకు అదనంగా అవసరం. వీటికోసం ప్రతిపాదించినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదని డివిజనల్ అధికారులు రైతులకు సమాధానమిస్తున్నారు.

నల్లగొండ డివిజన్‌లో అత్యధిక డిమాండ్

నల్లగొండ డివిజన్‌లో బోరుబావుల వ్యవసాయం ఎక్కువగా ఉండడంతో ఇక్కడ రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీలు తీసి ఎదురుచూస్తున్నారు. వర్క్ ఆర్డర్లు సైతం వచ్చినా సామగ్రి ఇవ్వకపోవడంతో ఇబ్బంది

మిగతా 8వ పేజీలో...



పవర్‌ప్లాంట్‌లో నియామకాల పూర్తి ఎన్నడో?

- జాప్యంపై నిర్వాసితుల్లో ఆందోళన
- తొలిదశలో ఇళ్లు కోల్పోయిన 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలు
- మరో 365 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి
- జూన్‌లోనే ఉత్తర్వులు వస్తాయని ఆశించినా దక్కని ఫలితం
- ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న నిర్వాసితులకూ ఉద్యోగాలివ్వాలనే డిమాండ్

నల్లగొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో భూములు కోల్పోయిన నిర్వాసితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ అయినా, ఈ ప్లాంటుతో ఆర్థికంగా భారమైనా పవర్‌ప్లాంటుకు భూములు, ఇళ్లు ఇచ్చి త్యాగం చేసిన నిర్వాసితులపై మానవీయ కోణంతో వ్యవహరిస్తామని, భూములు కోల్పోయిన వారికి ఇంటికో ఉద్యోగమిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్లాంటును తొలిసారి సందర్శించిన సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తొలి విడతలో ఇళ్లు కోల్పోయిన గిరిజన కుటుంబాలకు చెందిన 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. ఆ తర్వాత ఉద్యోగ నియామక ప్రక్రియ జాప్యమవుతుండటంతో రెండోదశలో ఉద్యోగాలు పొందాల్సిన భూనిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం పవర్‌ప్లాంటులో మొదటి యూనిట్‌ని జాతికి అంకితం చేయడంతో పాటు, ప్లాంటులో నిర్మించతలపెట్టిన టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన నిమిత్తం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఈ సందర్భంగానైనా ఉద్యోగాలిచ్చే అంశంపై స్పష్టమైన హామీ ఇస్తారనే ఆశ నిర్వాసితుల్లో వెల్లడవుతోంది.

దఫదఫాలుగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో ఉద్యోగాలిస్తామనే హామీ మేరకు ఇళ్లు, భూములు కోల్పోయిన

మిగతా 8వ పేజీలో...

నేడు థర్మల్ యూనిట్‌ను ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

దామరచర్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్లపాలెం శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పరిశ్రమలోని యూనిట్-1ను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి భారీ నీటిపారుదలశాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరుకానున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్న ఐదు యూనిట్లు ఉండగా, ఇప్పటికే యూనిట్-2ను ఈ ఏడాది మొదట్లో సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మొదటి యూనిట్ సైతం నాలుగు నెలల క్రితం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రమంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి కేబుల్ వ్యవస్థకు నష్టం వాటిల్లింది. దీంతో యూనిట్-1 ప్రారంభం ఆలస్యమైంది. ఎట్టకేలకు పనులు పూర్తి చేసిన అధికారులు ప్రారంభానికి సిద్ధం చేశారు. మిగిలిన మరో మూడు యూనిట్ల పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా ఉద్యోగుల కోసం నిర్మించనున్న టౌన్‌షిప్‌కు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, ఇక్కడికి 11గంటలకు చేరుకొని టౌన్‌షిప్‌నకు శంకుస్థాపన చేస్తారు. 11.45 గంటల ప్రాంతంలో యూనిట్-1ను ప్రారంభించి 800 మెగావాట్ల విద్యుత్‌ను జాతికి అంకితం చేస్తారు. 12.10గంటల వరకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశ్రమ అభివృద్ధి పనులను మంత్రులకు అధికారులు వివరించనున్నారు. అనంతరం 2.45గంటలకు మంత్రులు తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో రికార్డులను తనిఖీచేస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిర్దేశించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యం ప్రగతిలో ప్రధానంగా ఇప్పటివరకు పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎక్కడ, ఎవరి తప్పిదాలు లేకుండా పారదర్శకంగా లక్ష్యం పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం చూపిన మర్రిగూడ ఎంపీడీవోకు అప్పటికప్పుడే షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వచ్చే సోమవారం నాటికి డివిజన్ పరిధిలో ఇళ్ల నిర్మాణంలో 50శాతం లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో వెంకటయ్య, గృహనిర్మాణ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో శ్రీదేవి, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఐకేపీ ఏపీఎంలు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు పాల్గొన్నారు.

సెల్ లైట్ వెలుగులో హాస్పిటల్ తనిఖీ

మునుగోడు పీహెచ్‌సీ కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో వివిధ గదులను పరిశీలించారు. అనంతరం వివిధ రికార్డులను తనిఖీ చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొద్ది సేపటి వరకు విద్యుత్ సరఫరా రాకపోవడం, ఆస్పత్రిలో ఇన్వర్టర్ ఉన్నా, లైట్ వెలగకపోవడంతో సిబ్బంది సెల్ లైట్ వేశారు. ఆ వెలుగులోనే రికార్డులను కలెక్టర్ తనిఖీచేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.నరేష్, ఎంపీడీవో ఎం.విజయ్‌భాస్కర్ ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



నర్సింగ్ కళాశాల భూమి పూజలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో రూ.40కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో తాగునీటి ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో విద్య, నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్య సదుపాయాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లతో సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, రూ.20వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంజీయూలో రూ.100కోట్లతో భవనాలు నిర్మించామని, ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇటీవల ఎల్‌ఎల్‌బీ, ఎంఫార్మసీ, కోర్సులు, భవనాలు సీఎం మంజూరు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో విద్యాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని విమర్శించారు.

వైద్యరంగ బలోపేతానికి చర్యలు

జిల్లాలో వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అభివృద్ధి చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి నూతన వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాల కోసం అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే రూపొందించి సమర్పించాలన్నారు. త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.


రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

జిల్లా కేంద్రంలోని గంధవారిగూడెం వద్ద రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఈ నెల 4న భూమిపూజ చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నమూనా, నిర్మాణ పనులపై సమీక్షించారు. నల్లగొండ రెసిడెన్షియల్ పాఠశాలను రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. 5.58లక్షల అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో తొమ్మిది వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్స్, 3,000 మందికి ఒకేసారి భోజనాన్ని వండేలా వంటగది, 1,280 మంది ఒకేసారి భోజనం చేసేలా డైనింగ్ హాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మంత్రి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో మొక్క నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన రిషికేశ్ పిడుగుపాటుకు మృతి చెందగా, అతడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌నారాయణ్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, పాల్గొన్నారు.

సాంకేతికతతో కచ్చితమైన ఫలితాలు



క్లూస్‌టీం మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం క్లూస్ టీమ్‌కు కేటాయించిన నూతన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. నేరం జరిగిన ప్రదేశానికి క్లూస్ టీమ్ త్వరగా చేరుకొని, నమూనాలను సేకరణకు ఈ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. నూతన సాంకేతిక టెక్నాలజీతో డీఎన్‌ఏ శాంపిళ్ల సేకరణ, రక్త, తదితర నమూనాల సేకరణ, ఇతర ఆధారాలను భద్రపరిచే ఫోరెన్సిక్ సేఫ్ డ్రాయింగ్ క్యాబినెట్ లాంటి అన్ని సదుపాయాలు ఈ వాహనంలో ఉన్నాయన్నారు. ఎక్కడైనా హత్యలు, అత్యాచారాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు ఈ వాహనంలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవచ్చన్నారు. అన్ని సదుపాయాలు ఉన్న ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో ద్వారా నేర పరిశోధన సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్బీ సీఐ శ్రీనునాయక్, ఆర్‌ఐలు సూరప్పనాయుడు, సంతోష్, నరసింహ, క్లూస్ టీమ్ ఇన్‌చార్జి ఎస్‌ఐ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాను సాగుకు మాత్రమే వినియోగించాలి



ఏడీబ్ల్యూ డీఈఎఫ్ కేంద్రాన్ని తనికీచేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాలరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాయితీ యూరియాను వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి హెచ్చరించారు. చిట్యాల మండలం వెలిమినేడులో ఏడీబ్ల్యూ డీఈఎఫ్ కేంద్రాన్ని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్‌తో కలిసి ఆయన తనిఖీచేశారు. తయారీ కేంద్రంలో ఉన్న యూరియా బస్తాలను, ఆయిల్ తయారీ విధానాన్ని నిల్వ చేసిన ఆయిల్‌ను పరిశీలించారు. మరో ప్రాంతంలో నిల్వ చేసిన యూరియా బస్తాలను, విక్రయించేందుకు ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. వీటి నిర్వహణ తీరు, తయారీ గురించి నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు డీఎస్పీకి వివరించారు. రాయితీ యూరియాతో పాటు ఇండస్ట్రియల్ యూరియాతో ఆయిల్‌ను తయారు చేస్తున్నారని, అలా చేయకూడదని అన్నారు. పంటల సాగుకు రైతులు పంటపొలాల్లో చల్లే యూరియాను అడ్డదారిలో కొనుగోలు చేసి ఆయిల్‌ను తయారు చేసి విక్రయిస్తున్నారన్నారు. రాయితీ యూరియాను కేవలం వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని ఇతరత్రా అవసరాలకు ఎట్టిపరిస్థితుల్లో కూడా వినియోగించవద్దన్నారు. రాయితీ యూరియాను అక్రమంగా తరలించడం నేరమన్నారు. రాయితీ యూరియాను అక్రమంగా తరలించినా, నిల్వచేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి

నల్లగొండ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వసతి గృహ సంక్షేమ అధికారుల డైట్ బడ్జెట్, బిల్లులు పరిష్కారం కోసం కృషి చేస్తామని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. గురువారం టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహ సంక్షేమ అధికారుల డైట్ బడ్జెట్, బిల్లులు త్వరగా మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. వసతి గృహ సంక్షేమ అధికారుల పదోన్నతి విషయాన్ని టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం సహకారంతో పరిష్కరిస్తానని తెలిపారు. నూతన వసతి గృహ సంక్షేమ అధికారులు సభ్యత్వం నమోదు చేసుకోవాలని, రెవెన్యూ డివిజన్ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రణదివె, కార్యదర్శి ఏ.సత్యనారాయణ, టీఎన్జీవోస్ ఉపాధ్యక్షురాలు రమ్య సుధా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో చూపులేనివారికి వెలుగు

నల్లగొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో చూపులేని వారికి కంటి చూపు ప్రసాదించవచ్చని నల్లగొండ ఐడొనేషన్ సెంటర్ చైర్మన్ కేవీ.ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని లయన్స్ భవన్‌లో నేత్రదాతలకు కృతజ్ఞతాభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ సహకారంతో 2024 ఆగస్టు 1న నేత్రదానం ఉద్యమం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 157 కార్నియాలు, 4 పార్థివదేహాల నుంచి సేకరించామన్నారు. నేత్రదానాలు సేకరించడంలో రాష్ట్రంలోనే నల్లగొండ ఐ డొనేషన్ సెంటర్ ప్రశంసలు అందుకుంటోందని తెలిపారు. ప్రజలు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. నేత్రదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డాక్టర్ హరినాథ్, డాక్టర్ పుల్లారావు, ప్రనూష, సరిత, దామర యాదయ్య, ఏచూరి శైలజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్టులను సన్మానించారు.



నేత్రదానం చేసిన వారికి నివాళి అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అమ్మపాలు.. అమృతం

ప్రతి శిశువుకు ప్రకృతి అందించే అమూల్య సంపద తల్లి పాలు. బిడ్డకు తల్లి పాలు అమృతంతో సమానం. ప్రేమానురాగాలతో బిడ్డకు తల్లి పాలు పట్టిస్తే జీవితాంతం ఆరోగ్యంగా మనుగడ సాగిస్తారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తిని పొందాలంటే తల్లి పాలు పట్టించాల్సిందే. తల్లి పాలను పుట్టిన బిడ్డకు పడితే తల్లితో పాటు బిడ్డకు లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధుల నివారణకు దోహదం చేస్తుంది. ఇలాంటి విషయాలను తెలియజేస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల ప్రాముఖ్యాన్ని చాటేందుకు నేటి నుంచి వారోత్సవాలను నిర్వహించనున్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

● నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు ● తాగిస్తే బిడ్డకు, తల్లికీ రక్ష ● అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ● తల్లి పాల విశిష్టతపై ప్రచారం



తల్లిపాల వలన బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదగడంతో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో దోహదం చేస్తుంది. తల్లి పాలపై సరైన అవగాహన లేకపోవడంతో 60 శాతం పిల్లలు రక్తహీనతకు గురవుతున్నారు. 56 శాతం శిశు మరణాలు సంభవిస్తున్నాయి. ఇంతటి విశిష్టత కలిగిన తల్లి పాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చేవరకు ఇవ్వాలి? రోజుకు ఎన్ని సార్లు ఇవ్వాలి? తల్లి పాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి. ముర్రుపాలు బిడ్డకు ఎప్పుడు పట్టాలి. ఇలా అనేక అంశాలపై అందరికీ అవగాహన ఉండకపోవచ్చు. ఆధునిక కాలంలో అమ్మలకు ఇలాంటి విషయాలపై అసలు అవగాహన ఉండకపోవచ్చు. ఇందు కోసం ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. గ్రామాల్లో వారం రోజుల పాటు ఆరోగ్య శాఖ సహకారంతో తల్లి పాల వారోత్సవాలను చేపట్టనున్నారు. నల్లగొండ జిల్లాలో 2,093 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో తల్లిపాల విశిష్టతపై అవగాహన కలిగించనున్నారు.

ముర్రుపాలు తప్పనిసరి ఎందుకంటే

● బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలను ముర్రు పాలు అంటారు.

● ఇవి ఖచ్చితంగా బిడ్డకు పట్టాల్సిందే. దీంతో రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా శిశువుకు సమతుల్యమైన పోషక ఆహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులతో పాటు విటమిన్-ఏ ఉంటుంది.

● ముర్రుపాలు వ్యాధులు రాకుండా శిశువును కాపాడుతాయి.

● శిశువు పేగులను శుభ్రం చేసి మొదటి మల విసర్జనకు దోహదం చేస్తాయి.

● తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావడంలేదని అనుకోవడం అపోహ,

● ఆరు నెలల వరకు తప్పనిసరిగా బిడ్డకు రోజూ 8 నుంచి 10 సార్లు పాలుపట్టాలి.

బిడ్డకు లాభాలివి

● తల్లి పాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.

● శిశువులకు అవసరమయ్యే విటమిన్లు, ప్రొటీన్లు తల్లి పాలలో పుష్కలంగా ఉంటాయి.

●రక్త హీనత నుంచి కాపాడుతాయి.

●తొలి నెలలో వివిధ రకాల అంటు వ్యాధుల నుంచి రక్షిస్తాయి.

● బిడ్డ మనోవికాసానికి తల్లి పాలో ఎంతగానో తోడ్పడతాయి.

● ఎలర్జీ, అస్తమా, డయాబెటిస్ తదితర వ్యాధులు రావు.

● బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లి ఆరోగ్యానికి రక్ష

తల్లులు చనుబాలు ఇవ్వడం వలన కాన్పు తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. చనుబాలు ఇచ్చినందున ఊబకాయం వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును పొందగలుగుతారు. బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భసంచి, క్యాన్సర్లు దరిచేరవు. తల్లులకు మలి వయసులో వచ్చే ఎముకల బలహీనత నుంచి రక్షణ కలుగుతోంది. ముఖ్యంగా తల్లిబిడ్డల మధ్య బంధాన్ని పెంపొందిస్తోంది. తల్లికి, బిడ్డకు జ్వరం వచ్చినా టీకాలు వేసినా కూడా పాలు పట్టించవచ్చు.

తల్లిపాలు పుష్కలంగా రావాలంటే

గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలు కలిగిన సంతులిత ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, పండ్లు, తాజా కూరగాయలు తగిన మోతాదులో తీసుకోవాలి. వైద్యుల సలహా మేరకు తగిన పౌష్టికాహారం తీసుకోవాలి.

అమ్మపాల విశిష్టతపై అవగాహన



ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తాం. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులు, బాలింతలకు అమ్మపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తాం. తల్లిపాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టినబిడ్డకు తల్లిపాలు పట్టడం వలన పిల్లల్లో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. తాగిస్తే తల్లిబిడ్డల ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. అమ్మపాల అవగాహన సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి.

ఉదయశ్రీ, సీడీపీవో, అనుముల ప్రాజెక్టు.

బాలుడిని చితకబాదిన అంగన్‌వాడీ ఆయా



ఆయా కొట్టిన దెబ్బలకు బాలుడి వీపుపై వాపులు

నూతనకల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో ఓ బాలుడిని ఆయా చితక బాదింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మాచనపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాలుడి తల్లిదండ్రులు ముల్కలపల్లి సైదులు, ప్రశాంతి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ దంపతుల కుమారుడు జతిన్‌కుమార్‌ను మాచనపల్లి గ్రామంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రానికి పంపుతున్నారు. గురువారం ఆ కేంద్రంలో విధులు నిర్వహించే అంగన్‌వాడీ టీచర్ సెక్టార్ మీటింగ్‌కు వెళ్లారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా అయిన కొండి సోమమ్మ నిర్వహించింది. అయితే జతిన్‌కుమార్‌ను ఆయా కర్రతో చితకబాదింది. దీంతో బాలుడు ఏడ్చుకుంటూ ఇంటికి పరిగెత్తుకుంటూ వెళ్లి ఆయా కొట్టిందని తల్లిదండ్రులకు చెప్పాడు. బాలుడి వీపుపై వాతలు తేల డంతో తల్లిదండ్రులు కుమారుడితో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఎందుకు కొట్టావని ఆయా సోమమ్మను నిలదీశారు. దీంతో పొరపాటు జరిగిందని ఆయా తెలిపింది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయమై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను కొట్టవద్దని, బాలుడిని కొట్టిన విషయమై విచారణ చేసి ఆయాపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికను గర్భవతిని చేసిన నిందితుడికి 20ఏళ్ల జైలు

బాధితురాలికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశం

నల్లగొండ క్రైం / కట్టంగూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భవతిని చేసి ఆపై పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ నల్లగొండ న్యాయస్థానం తీర్పునిచ్చింది. శుక్రవారం నల్లగొండ జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు, అత్యాచారం, పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎన్.రోజారమణి ఈ మేరకు తీర్పు ప్రకటించారు. కేసు వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన వలిగొండ వెంకన్న కట్టంగూరు మండలానికి చెందిన బాలికను పరిచయం చేసుకొని మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెని గర్భవతిని చేశాడు. ఆపై పెళ్లి చేసుకోకుండా మోసం చేయడంతో బాధితురాలు 2018లో కట్టంగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిర్వహించారు. పోక్సో చట్టం-2012 సెక్షన్లు 5(1), 6 మరియు ఐపీసీ చట్టం 420, 376 కింద నేరం నిరూపితమవడంతో పోక్సో కోర్టులో నిందితుడికి శిక్ష పడింది. పోక్సో చట్టం ప్రకారం నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.25వేల జరిమానా విధించగా, బాలికను మోసం చేసిన నేరం (సెక్షన్-420) కింద మరో ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా చెల్లించాలని తీర్పు వెల్లడించారు. అదే విధంగా బాధితురాలికి జిల్లా లీగల్ సెల్ అథారిటీ నుంచి రూ.10లక్షల పరిహారాన్ని చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలుచేయాలని సూచించడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠినకారాగార శిక్ష, రూ.30వేల జరిమానా అమలు చేయాల్సి ఉంటుంది. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నిందితుడికి శిక్షపడేలా సరైన ఆధారాలు సేకరించి కోర్టులో సమర్పించిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు ఎస్‌ఐ రంజిత్, సీఐ క్యాస్ట్రో, ప్రస్తుత శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ రవీందర్, సీడీపీ రువ్వా నాగరాజు, భరోసా లీగల్ సెల్ అధికారి కల్పన, తదితరులను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ప్రభాకర్ కుటుంబ సభ్యులు

జనగామ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల నిర్లక్ష్యంతో రైతు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బంధువులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బసంతపురం గ్రామానికి చెందిన మెండు ప్రభాకర్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ, ట్రాక్టర్ కిరాయికి నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 27న పొలం దున్నుతుండగా విద్యుత్ తీగ తెగి పడడంతో విద్యుదాఘాతానికి గురై ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. ట్రాక్టర్ కేజీవీల్స్ రెండుకాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు జనగామ జిల్లా కేంద్రంలోని అజంతా ఆస్పత్రికి తరలించారు. ప్రభాకర్ కాలును పరిశీలించిన డాక్టర్ బాలాజీ ఇన్‌ఫెక్షన్ ఉందని, గాయం తగ్గుముఖం పట్టే వరకు ఆపరేషన్ వాయిదా వేయాలన్నారు. బుధవారం ప్రభాకర్‌ను ఇంటికి తీసుకొని వెళ్లాలని డాక్టర్ బాలాజీ తెలుపగా పరిస్థితి సీరియస్‌గా ఉంటే ఎలా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు నిలదీశారు. దీంతో ఆస్పత్రిలోనే ఉంచగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రభాకర్ మృతి చెందాడని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్ బాలాజీని వివరణ కోరగా ప్రభాకర్‌రెడ్డి మధుమేహం, మోకాళ్ల వాపు, ఇతర సమస్యలతో బాధపడుతున్నాడని, అవి తగ్గుముఖం పట్టే వరకు ఆపరేషన్ వాయిదా వేశామన్నారు. అంతలోనే గుండెపోటు వచ్చి మృతి చెందాడన్నారు. ఇందులో తమ నిర్లక్ష్యం, వైద్యుల తప్పు ఏమీ లేదన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్, ఐదుగురు పరారీ

కనగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రాత్రి కనగల్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిలో ఇద్దరిని అదుపులో తీసుకోగా, మరో ఐదుగురు పరారయ్యారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.20 వేల నగదు, మూడు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. పరారైన వారిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన వివరించారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

భూదాన్‌పోచంపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం మెహర్‌నగర్ గ్రామానికి చెందిన తోటకూర నరసింహకు చెందిన గొర్రెల మందపై గురువారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేశారు. 10 గొర్రెలు మృతి చెందగా 8 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. గొర్రెలకాపరి నర్సింహను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకులపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం, లక్కారం గ్రామాల్లో బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న కోయగూడ వెంకటేశ్, సిల్వేరు కవితలపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. వారి నుంచి 22 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పరిచారకుడిగా మొదలై ప్రధానార్చకుడిగా

● యాదగిరిగుట్ట ప్రధానార్చకుడు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యుల ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మీనరసింహాచార్యులును సన్మానిస్తున్న దేవాదాయ కమిషనర్ వెంకట్రావ్

యాదగిరిగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ప్రధానార్చకుడిగా కొనసాగిన నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. 1979 డిసెంబరు 13న యాదగిరిగుట్ట ఆలయంలో పరిచారకునిగా జీవన ప్రస్థానం ప్రారంభించిన ఆయన ప్రధానార్చకుడి హోదాలో ఉద్యోగబాధ్యతలు ముగించారు. గురువారం ఆలయ తూర్పుమాడ వీధుల్లోని కళావేదికపై ఆయన్ను సన్మానించారు. దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్ వెంకట్రావ్, కలెక్టర్ ఎం.హనుమంతరావు ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన నల్లంథీగల్ ధర్మాచార్యులు-సీతమ్మ దంపతులకు నాలుగో సంతానంగా 1960 జూలై 20న జన్మించారు. 1974లో వైదిక విద్యార్థిగా ఆగమ పాఠశాలలో చేరి చిలకమర్రి శ్రీనివాసాచార్యుల ప్రోత్సాహంతో ఆగమశాస్త్రంలో ప్రావీణ్యం పొందారు. పాంచరాత్రాగమశాస్త్ర ప్రవేశ, వర, ప్రవర, వైఖానస, ఆగమశాస్త్ర ప్రవర, స్మార్థ ఆగమశాస్త్ర అధ్యాయం, యజుర్వేద సంహిత, ఆళ్వార్ దివ్య ప్రబంధ అధ్యయనం, జ్యోతిష్య, వాస్తు, పురాణ, విజ్ఞాన శాస్త్రాలను అభ్యసించారు. ఆ తర్వాత నల్లగొండ రామగిరిలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తూనే 1979 డిసెంబరు 13న యాదగిరిగుట్ట ఆలయంలో పరిచారకుడిగా జీవన ప్రస్థానం ప్రారంభించారు. వైదిక విద్యను అభ్యసిస్తూనే ఎంఏ తెలుగు, సంస్కృతంపై పీజీని పూర్తిచేశారు. వేద గ్రంథాల్లో గ్రంథ రచన చేసి డాక్టరేట్ పొందారు. 1980లో వేదాంతం రామాచార్యులు-సింగమ్మ దంపతుల ఏకైక కుమార్తె విజయకుమారితో వివాహమైంది. వీరికి ధర్మప్రణీత్, యాద ఫణీంద్ర, సీతామనోహరాచార్యులు ముగ్గురు కుమారులు. యాదగిరిగుటలో అర్చక వృత్తిలో చేరి 2010లో ప్రధానార్చకుడిగా బాధ్యతలు స్వీకరించారు. 2016 నుంచి 2022 వరకు ఆలయ పునర్నిర్మాణం తర్వాత ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం, స్వర్ణగోపురం ప్రతిష్ఠాపన వంటి కీర్తి నొందే విశేషమైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది వరకు ప్రధానార్చకుడిగా కొనసాగుతూ తర్వాత స్థానాచార్యులుగా అవకాశం దక్కగా ప్రస్తుతం వివాదంలో ఉంది. కొండపైన జరిగిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో కాంచీ, మేలుకోటీ(కర్ణాటక), తిరుమల, ఆహోబిలం, ఒంటిమిట్ట, కదిరి, అన్నవరం, సింహాచలం, భద్రాచలం తదితర దేవాలయాలకు చెందిన ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

యూరియా అక్రమదందా నిందితుల అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సబ్సిడీ కింద ఇచ్చే యూరియాను అక్రమమార్గం పట్టించి డీఈఎఫ్‌ను తయారుచేస్తూ, విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిహార్ రాష్ట్రానికి చెందిన నాగదేవ్ శంకర్‌యాదవ్ నల్లగొండ జిల్లా వెలిమినేడు శివారులో కొంతకాలంగా దాబా హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల డీఈఎఫ్‌ను తయారుచేసే మిషన్‌ను రూ.5 లక్షలకు కొనుగోలు చేసి వెలిమినేడు శివారులో ఏర్పాటుచేశాడు. ఇందుకోసం మొదట హైదరాబాద్ నుంచి రూ.1500లకు బస్తా యూరియా ఖరీదు చేసేవాడు. అది లాభసాటిగా లేకపోవడంతో రైతులకు సబ్సిడీ కింద వచ్చే యూరియా గురించి తెలుసుకుని అదే గ్రామానికి చెందిన గోలి శంకరయ్యను సంప్రదించాడు. వారు ఇద్దరు వెలిమినేడు పీఏసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మేడవేని దుర్గయ్యను కలిసి సొసైటీ ద్వారా రైతులకిచ్చే యూరియా ఇప్పిస్తే బస్తాకు రూ.30 కమీషన్ చొప్పున ఇస్తామని ఒప్పించారు. దీంతో దుర్గయ్య సుమారు 70బస్తాలు రైతుల పేరుతో మరో 20బస్తాలు రిజిస్టర్‌లో రాయకుండానే వారికి విక్రయించాడు. ఇవేకాకుండా గోలి శంకరయ్య తన ఆధార్‌కార్డుతో చౌటుప్పల్ పీఏసీఎస్‌లో 20బస్తాలు, చిట్యాల పీఏసీఎస్‌లో 20బస్తాలు, గుండ్రాంపల్లి పీఏసీఎస్‌లో 20బస్తాలు కొనుగోలు చేశాడు. ఈ యూరియాతో అనుమతి లేని డీఈఎఫ్ తయారుచేస్తూ డ్రమ్ములలో నింపి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. నాగదేవశంకర్ యాదవ్, గోలి శంకరయ్య, మేడవేని దుర్గయ్యతో పాటు కంపెనీలో పనిచేస్తున్న వినోద్‌కుమార్, రాజీవ్‌రాయ్, రోషన్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 14 సబ్సిడీ యూరియా బస్తాలు, 52 ఇండస్ట్రియల్ యూరియా బస్తాలు, ఒక ట్రాలీ వాహనం, ఒక ఆటో, డీఈఎఫ్ తయారీకి ఉపయోగించే యంత్రపరికరాలు, 16 డ్రమ్ములలో ఉన్న 1000 లీటర్ల డీఈఎఫ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


మరింత లోతుగా విచారణ చేసి ఈ అక్రమదందాలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేస్తామని డీఎస్పీ ప్రకటించారు. సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.

వర్షాకాలం.. వ్యాధులతో జాగ్రత్త

● అప్రమత్తతో వ్యాధులకు అడ్డుకట్ట

● పరిసరాలను జాగ్రత్తగా ఉంచుకోవాలి

● రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు



డాక్టర్ మౌనిక, బీబీనగర్

బీబీనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి. ఆహారం, తాగు నీరు మూలంగా వచ్చేవి కొన్ని వ్యాధులయితే, దోమలు, క్రిమీ కీటకాలతో ప్రమాదకరమైన వ్యాధులు వస్తుంటాయి. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ వైద్యాధికారి డాక్టర్ మౌనిక పలు సూచనలు చేస్తున్నారు.

చికున్ గున్యా

మంచినీటిలో పెరిగే ఎడినో ఈజిప్ట అనే దోమ కుట్టడంతో వైరస్ శరీరంలోకి ప్రవేశించి చికున్ గున్యా సోకుతుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న రోగిని కుట్టిన దోమ ఆరోగ్యవంతమైన వేరొక వ్యక్తికి కుట్టడం వల్ల వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు : తీవ్రమైన జ్వరం, ఒంటినొప్పులు, తలనొప్పి వస్తాయి. మందులు వాడడంతో జ్వరం, నొప్పులు, తలనొప్పి తగ్గినా మళ్లీ ఈ లక్షణాలు తిరగబడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు : రోగిలో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. కీళ్ల నొప్పులకు సంబంధించి వైద్యులు సూచించిన మందులనే వాడాలి.

మెదడు వాపు వ్యాధి

క్యూలెక్స్ అనే దోమ కుట్టడంతో వైరస్ శరీరంలోకి ప్రవేశించి మెదడువాపు వ్యాధి సోకుతుంది. ఐదేళ్లలోపు వయసు వారికి సోకుతుంది. దోమ కుట్టిన 6 రోజుల్లోపు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రమైనప్పుడు ఒకవైపు పక్షవాతం వచ్చే అవకాశముంది.

లక్షణాలు : కళ్లు తిరగడం, అనుకోకుండా జ్వరం వచ్చి దాని తీవ్రత పెరుగుతుంది. రోగి అపస్మారక స్థితిలోకి చేరుకునే అవకాశముంది. పక్షవాతానికి గురికావచ్చు. వంకర్లు తిరిగి శరీరం అదుపు తప్పుతుంది.

జాగ్రత్తలు: వ్యాధి లక్షణాలు రోగిలో కనిపించిన వెంటనే చికిత్స చేయించాలి. నివాసగృహాలకు మూడు కిలోమీటర్ల పరిధిలో పందులు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రోగి వాంతి చేసిన ద్రవాలు బయటకు తీసి నేటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి.

అతిసారం

వర్షాకాలంలో ఈగల సంతతి పెరిగి విజృంభిస్తాయి. వీటి కారణంగా తినే ఆహారపదార్థాలు కలుషితమై అతిసారం(డయేరియా) సోకుతుంది. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

లక్షణాలు : వాంతులు, వీరేచనాలు ఎక్కువగా అవుతాయి. కడుపునొప్పితో పాటు గంట సమయంలో దాదాపు ఆరు వీరేచనాలు అవుతాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స చేయించాలి.

జాగ్రత్తలు : ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల సమక్షంలో చికిత్స చేయించాలి. రోగి నీరసించకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపి తాగించాలి.

డెంగీ

డెంగీవ్యాధి ప్రమాదకరమైనది. మంచినీటిలో పెరిగే ఎడిన్ ఈజిప్ట అనే దోమ కుట్టడంతో శరీరంలోకి నాలుగురకాల వైరస్‌లు వ్యాప్తి చెంది, ఈ వ్యాధి సంక్రమిస్తుంది. డెంగీ, ఫీవర్, డెండీ హెమరైజుడ్, డెంగ్యూ షాక్ సిండ్రీమ్ వంటి మూడు రకాల వ్యాధులుగా గుర్తిస్తారు. షాక్ సిండ్రీమ్ హెమరైజుడ్ ఫీవర్‌లకు గురైన వారు ఒకానొక దశలో ప్రాణాలు సైతం పోయే స్థితికి చేరుతారు.

లక్షణాలు : తీవ్రంగా జ్వరం వస్తుంది. శరీరం ఎర్రగా కందిపోతుంది. కీళ్లు, కండరాలు, ఒళ్లు విపరీతంగా నొప్పులు మొదలవుతాయి. కళ్లు కదిలించలేని విధంగా మూతలు పడతాయి. సాధారణ వాంతులు, రక్తంలో కూడిన వాంతులు అవుతు ఒంట్లో వికారంగా ఉంటుంది.

జాగ్రత్తలు : వ్యాధి సోకిన వ్యక్తిని వెంటనే వైద్యుల సంరక్షణలో చికిత్స చేయించాలి. వ్యాధి పూర్తిగా నయం చేసే చికిత్స లేదు. రోగి అన్ని విధాల పూర్తి ఆరోగ్యంగా తిరిగే వరకు వైద్యుల సమక్షంలో ఉంచాలి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాములు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మాడ్గులపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లికి చెందిన బొమ్మ రాములు(60) మధ్యాహ్నం స్థానిక ఎరువుల దుకాణం ఎదురుగా ఉన్న అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిని దాటుతున్నాడు. అదే సమయంలో నల్లగొండ వైపు వెళ్తున్న లారీ రాములును బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని రాములు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. రాములు కుమార్తె మేకల సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కాగా రాములకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా...

డిండి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా డిండి మండలంలోని బొల్లనపల్లి స్టేజీ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శి మండలం పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన లక్కి విజయ్‌భాస్కర్‌రెడ్డి(18), మచ్చుమర్రి ప్రకాష్‌రెడ్డి, వార్పు సిద్ధార్థ్‌రెడ్డి కలిసి ద్విచక్రవాహనంపై బుధవారం శ్రీశైలం క్షేత్రానికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం నాగార్జునాగసాగర్‌కు తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో డిండి మండలం బొల్లనపల్లి స్టేజి వద్ద దేవరకొండ-డిండి ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు కింద పడింది. ఈ సంఘటనలో ఇద్దరి మధ్యలో కూర్చున్న లక్కి విజయ్‌భాస్కర్ రెడ్డి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడేకక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విజయ్‌భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుతో యువకుడు




మణికంఠ(ఫైల్)

తుర్కపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటు వేయడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి రిగింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బెజనమైన కవిత, సంజీవ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సంజీవ విధుల్లో ఉండగా, బుధవారం రాత్రి భార్య కవిత, ఇద్దరు కుమారులు కలిసి భోజనం చేశారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పెద్దకుమారుడు బెజనమైన మణికంఠ(26)ను అర్ధరాత్రి సమయంలో పాముకాటు వేసింది. ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో పామును గుర్తిస్తున్న సమయంలోనే ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మణికంఠను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు బంధుమిత్రులు, గ్రామస్థుల హృదయాలను కలిచివేశాయి. బీఆర్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్న బెజనమైన మణికంఠ పాముకాటుతో మృతి చెందడంతో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆమె వెంట ఆలేరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పలుగుల నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సంచార్ సాథితో మోసాలకు చెక్

● 21భాషల్లో అందుబాటులో యాప్ ● దొంగిలించిన మొబైల్ ఫోన్ల రికవరీ సులువు ● సైబర్ మోసాలకు చెక్



అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికకు అనుగుణంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఆయా నేరాల అదుపు చేయడం ప్రభుత్వానికి సవాల్‌గా మారుతోంది. మొబైల్‌తో మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూనే కీలక రంగాల్లో సైబర్ భద్రతను బలోపేతం చేస్తోంది భారత ప్రభుత్వం. సైబర్ నేరాలకు సాంకేతికతతో చెక్‌పెట్టే దిశగా కేంద్ర సమాచార శాఖ అడుగులేస్తోంది. అందులో భాగంగానే భారత ప్రభుత్వ సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్స్(డీవోటీ) ఆధ్వర్యంలో సంచార్ సాథి యాప్‌ను రూపొందించారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్స్ (డీవోటీ) రూపొందించిన 'సంచార్ సాథి' వెబ్ పోర్టల్, యాప్ రూపంలో ప్రజలకు అందుబాటులో ఉంది. మొబైల్ వినియోగదారులకు సాధికారత కల్పించడంతో పాటు వారి భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించారీ యాప్‌ను. కనీస అవగాహన ఉన్న వారందరూ సులభంగా వాడే విధంగా ప్రత్యేక ఆప్షన్లు కలిగిన ఈ యాప్‌ను దేశవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగిస్తున్నారు. సంచార్ సాథి యాప్ లేదా పోర్టల్ వినియోగంతో ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేయొచ్చంటున్నారు నిపుణులు. అంతేగాక స్పామ్ కాల్స్, సైబర్ నేరాల ముప్పు నుంచి స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు సంచార్ సాథి యాప్ భద్రత కలిగిస్తుందంటున్నారు పోలీసులు. దేశంలో సైబర్ నేరాలు పెరుగుతుండగా, భారత ప్రభుత్వం ఈ యాప్‌ను 21 భాషల్లో అందుబాటులో ఉంచింది.



రికవరీ అయిన ఫోన్లు బాధితులకు అప్పగిస్తున్న పోలీసులు (ఫైల్)

ఫ్రాడ్ కాల్స్ అరికట్టేందుకు.. 'చక్షు'

ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఫ్రాడ్ కాల్స్. ప్రచారం కోసం, ప్రమోషన్ కోసమో, ఖాతాను ఖాళీ చేసేందుకో కాల్స్ వస్తుంటాయి. అందులో ఫ్రాడ్ కాల్స్ ఏవో, ఏ కాల్‌కు ఆన్సర్ ఇవ్వాలో తెలియక అయోమయానికి గురయ్యేంతగా వస్తున్నాయి. ఈ యాప్‌లోని 'చక్షు' ఫీచర్ వినియోగదారులను మోసపూరిత కమ్యూనికేషన్ (ఫ్రాడ్ కాల్స్, మెసేజెస్, వాట్సప్ చాట్)లను నివేదించడానికి అనుమతిస్తుంది.

సంచార్ సాథి యాప్ ఉపయోగకరం



గతంతో పోలిస్తే దొంగిలించిన మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం సులభతరంగా మారింది. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రేషన్(సీఈఐఆర్)పోర్టల్ ద్వారా ఆయా ఫోన్లను కనుగొంటున్నాం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్స్ (డీవోటీ) రూపొందించిన సంచార్ సాథి యాప్ ఉపయోగకరంగా ఉంది. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రజలు మొబైల్ ఫోన్ పట్ల, వినియోగంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

● సోమనర్సయ్య సీఐ, టూ టౌన్, మిర్యాలగూడ.

ఉపయోగాలెన్నో..

● పోగొట్టుకున్న లేదా దొంగిలించిన ఫోన్‌లను సంచార్ సాథి అప్లికేషన్‌తో కొనుగోవచ్చు. పోగొట్టుకున్న ఫోన్‌ను సదరు ఫోన్ ఐఎంఈఐ నెంబరు ద్వారా బ్లాక్ చేయడంతో పాటు దొంగిలించిన ఫోన్‌ను కొనుగోవడానికి ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

● ఒకరి పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్స్ ఉన్నాయో సులభంగా తెలుసుకోవచ్చు. సంచార్ సాథి అప్లికేషన్‌లోని టెలికాం అనలిటిక్స్ ఫర్ ఫ్రాడ్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్(టీఏఎఫ్‌సీవోపీ) విధానం ద్వారా ఒకరి పేరు మీద ఎన్ని సిమ్ కనెక్షన్స్ ఉన్నాయో తెలుసుకోవచ్చు.

● కొత్తది లేదా పాత(సెకండ్ హ్యాండ్)ఫోన్‌ను కొనుగోలు చేసేటప్పుడు ఆ ఫోన్ వాస్తవికతను సంచార్ సాథి యాప్‌తో తనిఖీ చేసుకునే వీలుంటుంది .

● యాప్ సపోర్ట్ విభాగం ద్వారా స్మార్ట్ ఫోన్ వినియోగదారులు సలహా, సంప్రదింపులు చేసుకునే వీలుంటుంది.

ప్లే స్టోర్/యాపిల్ స్టోర్స్‌లలో..

ప్లే స్టోర్ ద్వారా స్మార్ట్ ఫోన్ వినియోగదారులు, ఆపిల్ స్టోర్ ద్వారా యాపిల్, ఐ ఫోన్ వినియోదారులు సంచార్ సాథి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే మొబైల్ నెంబర్ ఎంటర్ చేస్తే వచ్చే ఓటీపీతో యాప్ లేదా పోర్టల్‌కు కనెక్ట్ కావొచ్చు. టోల్ ఫ్రీ నెంబరు 18002588181కు కాల్ చేసి సంచార్ సాథి అప్లికేషన్ వివరాలు తెలుసుకోవచ్చు.

లక్షలాది మంది వినియోగదారులు

సంచార్ సాథీ యాప్/పోర్టల్‌ను లక్షలాది మంది వినియోగిస్తున్నారు. యాప్ ద్వారా ఇప్పటికి అందిన ఫిర్యాదులు 209.91 లక్షలు కాగా, అందులో 183.03.లక్షల ఫిర్యాదులను పరిష్కరించారు. ఇక యాప్ ద్వారా బ్లాక్ చేసిన మొబైల్స్ కనెక్షన్స్ 35.60 లక్షలు, ట్రేస్ చేసిన మొబైల్స్ 21.64 లక్షలని గూగుల్ గణాంకాలు పేర్కొనడం గమనార్హం.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర, జూలై 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంప్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల ఆధారంగా ప్రవేశానికి అర్హులని, దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా కాని, స్వయంగా విద్యాల యంలో అందజేయవచ్చని తెలిపారు. నవోదయ విద్యాలయం వెబ్‌సైట్ https://navodaya.gov.in/ ద్వారా దరఖాస్తులు తీసుకొని నింపి రిజిస్టర్ పోస్టు ద్వారా, లేదా వ్యక్తిగతంగా నవోదయ విద్యాలయంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను jnvnalgondaxi2526@gmail.com మెయిల్‌కు ద్వారా కూడా పంపవచ్చని తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులకు చివరి తేదీ అని, ప్రవేశ ప్రక్రియ ఈనెల 25లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

పానగల్ కళాశాలలో ఇంజనీరింగ్ అడ్మిషన్లు

నల్లగొండ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో పానగల్ కళాశాలలో రిపోర్టు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పానగల్ కళాశాలలో లభించే దరఖాస్తుతోపాటు రూ.250ల చలాన్ చెల్లించాలని తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియ పూర్తి వివరాల కోసం సెల్: 9490565566, 9640705745లో సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి యోగాసన ఎంపిక పోటీలు



జిల్లాస్థాయి పోటీల్లో యోగాసన ప్రదర్శనలు చేస్తున్న బాల, బాలికలు

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యోగాసభ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని హార్టఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్‌లో గురువారం జిల్లాస్థాయి యోగాసన సబ్ జూనియర్, జూనియర్ బాల, బాలిక విభాగాల్లో ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 120మంది బాల, బాలికలు హాజరై యోగాసన ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆగస్టు 7,8వ తేదీల్లో ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి, ప్రధాన కార్యదర్శి రాయనబోయిన శ్రీను తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో టీ. సాయి, లిపి, వరలక్ష్మి, చిద్విలాస్య, టి. ఆమన్, శ్రీహస్‌రావు, అభిరామ్, సృజన్, జూనియర్ విభాగంలో సిరి, చంద్రిక, సీనియర్స్ విభాగంలో సోమశేఖర్, చైతలి, ఇందిరా, వెంకట రామారావుకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో యోగా మాస్టర్స్ నామిరెడ్డి సుష్మ, మహేశ్వరి, సునీత, శ్రీనివాసులు, భోనం నాగిరెడ్డి పాల్గొన్నారు.

యోగితకు బాక్సింగ్‌లో కాంస్య పతకం



యోగితను అభినందిస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

నల్లగొండ స్పోర్ట్స్, మిర్యాలగూడ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆగ్రాలో ఈ నెల 23 నుంచి 27వ తేదీల్లో వరకు నిర్వహించిన 54 కేవీఎస్ జాతీయ స్థాయి బాక్సింగ్ క్రీడా మీట్ అండర్- 14పోటీల్లో మిర్యాలగూడలోని కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న బి. యోగిత కాంస్య పతకం గెలుచుకుంది. పతకం సాధించిన యోగితతో డీవైఎస్‌వో అహ్మద్ అలీ స్థానిక సంస్థల సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌ను గురువారం ఆయన చాంబర్‌లో కలిశారు.

సాగర్ ప్రాజెక్టు విశ్రాంత ఎస్ఈ మృతి



మధుసూదన్‌రావు(ఫైల్)

నాగార్జునసాగర్,జూలై 31(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్ఈగా పనిచేసిన జీవీవీఎస్. మధుసూదన్‌రావు (68) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఉమ్మడి ఏపీలో సాగర్ ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో పలు హోదాల్లో పనిచేసిన ఆయన రాష్ట్ర విభజన అనంతరం కుడి కాల్వ ఎస్ఈగా కూడా పనిచేశారు. మధుసూదన్‌రావు మృతికి ఇంజనీర్లు, ఉద్యోగులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


వీల్‌చైర్ క్రికెటర్ సురేష్‌కు గవర్నర్ అభినందన



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సన్మానిస్తున్న వీల్‌చైర్ క్రికెట్ క్రీడాకారుడు సురేష్

తిరుమలగిరి(సాగర్), జూలై 31(ఆంధ్రజ్యోతి): వీల్‌చైర్ క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న నల్లగొండ జిల్లా తిరుమలగిరిసాగర్ మండలంలోని రంగుండ్ల తండాకు చెందిన ధరావత్ సురేష్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. హైదరాబాద్ హరికేన్ వీల్‌చైర్ క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న సురేష్ గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీల్‌చైర్ క్రికెట్, దివ్యాంగుల క్రీడాకారుల గురించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మారుమూలతండా నుంచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తున్నందుకు సురేష్‌ను అభినందించారు. మున్ముందు మరింతగా రాణించాలన్నారు. దివ్యాంగులు పలు క్రీడల్లో సమస్యల గురించి గవర్నర్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమావత్ దేవునాయక్, జగదీష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

4 నుంచి యాదగిరిగుట్టలో పవిత్రోత్సవాలు



యాదగిరిగుట్ట, జూలై 31(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ అధికారులు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన స్వర్ణ దివ్య విమాన రాజగోపురం తొలిసారి పవిత్రీకరించనున్నారు. సుదర్శన ఆళ్వారుడికి తొలత పవిత్రాధారణ చేస్తారు. స్వర్ణ గోపురాన్ని అభిషేకించేందుకు చుట్టూ పరాంజ బిగించారు. 50అడుగుల ఎత్తులో ఐదు అంతస్తుల్లోని గోపురం పవిత్రీకరణ వేడుకగా సాగనుంది. ఆలయంలో నిర్వహించే వార్షిక, నిత్య పూజాది కార్యక్రమాల్లో దోషాలు, పొరపాట్ల నవరణకు ఏటా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. వేడుక నిర్వహణకు అర్చక బృందం సిద్ధమైంది. విశ్వక్సేన పూజ తొలిరోజు, రెండో రోజు పవిత్రల రూపకల్పన పూజ, ప్రతిష్ఠ, పవిత్రల అలంకరణ మూడో రోజు అర్చకులు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలకు సంబంధించిన పూజలు పాతగుట్ట ఆలయంలో కూడా యథావిధిగా కొనసాగనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా 5, 6వ తేదీల్లో ఉభయ ఆలయాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహోత్సవాలు, లక్ష పుష్పార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమం రద్దు చేస్తున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.

ఆండాళ్ సదనం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఈవో వెంకట్రావ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆండాళ్ సదనాన్ని దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. 'నిరుపయోగంగా అద్దె గదులు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అధికారులతో కలిసి ఉదయం 11.30 గంటలకే చేరుకొని సదనంలోని గదులు, వాటిలో తలుపులు, ఫ్యాన్లు, లైట్లు, నల్లాలు పరిశీలించారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. గదులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈవో గజ్వేల్లి రమేష్ బాబు, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, బీ5 విభాగం అధికారి మల్లేషం ఉన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం కొండచుట్టు ప్రధాన కూడళ్ల వద్ద దేవుళ్ల పేరుతో నామకరణం చేసిన విషయం తెలిసిందే. కొండకింద వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేకంగా రూట్లను సూచించే క్యూఆర్ కోడ్ ప్రస్తుతం భక్తులకు అందుబాటులోకి వచ్చింది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



హారతి నివేదిస్తున్న ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ము త్యాలు, బంగారు, వజ్రవైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు కొనసాగింది. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.19,89,924 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. స్వామివారిని ఎమ్మెల్సీ కోటిరెడ్డి సతిసమేతంగా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సుదర్శన భగవానుడి జన్మనక్షత్రం పురస్కరించుకొని దివ్య తిరునక్షత్ర హోమం నిర్వహించారు. మూలమూర్తులకు అష్టోత్తరశతఘటాభిషేకం నిర్వహించి స్వామివారిని విశేషంగా అభిషేకిస్తారు.

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో గురువారం వేదపండితులు కన్నుల పండువగా వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు.

కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

● 26గేట్ల ద్వారా కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల ● సాగర్ అందాలు తిలకిస్తున్న పర్యాటకులు



నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరిగింది. రెండో రోజు గురువారం కూడా 26క్రస్ట్ గేట్లు ఎత్తి దిగు వకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 585.10 అడుగులు(297.7235టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి మొత్తం 2,43,829 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,82,609 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

కొనసాగుతున్న పర్యాటకుల సందడి

మూడు రోజులుగా నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి కొనసాగుతోంది. సాగర్ ప్రాజెక్టు 26క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల అవుతుండడంతో కృష్ణమ్మ అందాలు తిలకించడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రధాన డ్యాంపైకి పర్యాటకులకు అనుమతి లేకపోవడంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో, కొత్త వంతెన వద్ద నుంచి పర్యాటకులు కృష్ణమ్మ సోయగాలను తిలకించి పరవశిస్తున్నారు. చిన్న, పెద్ద, తేడా లేకుండా చంటి పిల్లలతో సహా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. సాగర్‌లో కనీసం వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పర్యాటకులు తెలిపారు. తినడానికి సరైన భోజన వసతులు కూడా లేవని వారు పేర్కొంటున్నారు.



సాగర్ అందాలు తిలకిస్తున్న పర్యాటకులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



తీజ్ పండుగలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలకేంద్రంలో పీర్ల కొట్టానికి గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. ఆలేరు నియోజకవర్గానికి అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని, మొదటి విడతలో నిర్మించే పనులను డబ్బులు చెల్లింపు కూడా అవుతున్నాయన్నారు. అనంతరం మండలంలోని లక్ష్మీతండా, బిక్యా తండాలో గిరిజనవాసులు నిర్వహిస్తున్న తీజ్ పండుగలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ వైస్‌చైర్మన్ రాజేష్‌పైలెట్, నాయకులు మర్రి భగవంతురెడ్డి, రాంపల్లి మహేష్, చీర సత్యనారాయణ, మర్రి కృష్ణారెడ్డి, జూపల్లి శ్రీకాంత్, దేవస్థాన కమిటీ చైర్మన్ పండుగ రాజు, రాజు నాయక్, ఈశ్వర్, నరసింహ పాల్గొన్నారు.

డీ-39, 40 కాల్వకు నీరందించాలి



తిప్పర్తిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తిప్పర్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల శివారు నుంచి సాగునీరు సరఫరా చేసే డీ-39,-40 కాల్వలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కాల్వలకు నీరందించాలని కోరుతూ రైతులు గురువారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి మండలానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాల్వల ద్వారా ఆదివారం పూర్తి స్థాయిలో నీరు రాకుంటే సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడి చేస్తామని రైతులు హెచ్చరించారు. రైతులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో నీటి మట్టం పెరిగి నీరంతా సముద్రపు పాలవుతున్నా, మండలానికి వచ్చే సాగు నీటిని అధికారులు వారబందీ పేరుతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నీళ్ల సమృద్ధిగా ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కాల్వల ద్వారా చెరువులను పూర్తిస్థాయిలో నింపి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై సుమారు 20నిమిషాల పాటు రైతులు బైఠాయించారు. ఈ కార్యక్రమంలో కందుల లక్ష్మయ్య, రైతులు రామచంద్రు, సైదులు, రొట్టెల జానయ్య, దేవిరెడ్డి లింగారెడ్డి, దయాకర్‌రెడ్డి, నూకల ప్రవీణ్, రావుల సందీప్, రాజీవ్, బైరగోని శ్రీను, జాకటి బాలయ్య, కట్ట కిట్టు, రవి, జానీపాష, కస్పరాజు వెంకన్న, రొట్టెల సైదులు పాల్గొన్నారు.

రైతుల నిరసన



చెరువులో దిగి నిరసన తెలుపుతున్న రైతులు

మాడ్గులపల్లి: డీ-40 కాల్వ ద్వారా చెరువులను నింపాలని మండలంలోని గుర్రప్పగూడెం గ్రామానికి చెందిన 30మంది రైతులు గ్రామంలో ఉన్న నూకనాయన చెరువులో దిగి చెరువులో దిగి నిరసన తెలిపారు. భూగర్భజలాలు అడుగంటి బోర్లు పోయలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. డీ-40 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు అయిన మండలంలోని అన్ని చెరువులు నింపడంతోపాటు ఆయకట్టుకు నీరందించాలని అన్నారు. ప్రభుత్వం ముందుచూపుతో ఉదయ సముద్రం ప్రాజెక్టును నింపి డీ-40 ద్వారా చెరువులు నింపితే సమస్య వచ్చేది కాదన్నారు. సాగర్ గేట్లు ఎత్తి నీటిని వృథా చేస్తున్నారన్నారు.

ఎరుకల సమస్యలు పరిష్కరించాలి

నార్కట్‌పల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎరుకల కులస్థుల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి భాస్కర్ అన్నారు. ఆగస్టు 3న ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నిర్వహించే ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి ఎరుకలు తరలిరావాలని కోరారు.

ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లుకు ఈఈగా అదనపు బాధ్యతలు

రామగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కందుకూరి వెంకటేశ్వర్లుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా బాధ్యతలు నిర్వర్తించిన సత్యనారాయణ హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ శాఖకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆ స్థానంలో వెంకటేశ్వర్లకు అదనపు బాధ్యతలు అప్పగించింది.

స.హ. చట్టంపై అవగాహన కల్పించాలి


కమిషనర్‌ను కలిసిన ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు

నల్లగొండరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి సంస్థ, ఎలక్షన్ వాచ్ కమిటీ ద్వారా చేస్తున్న సేవలను డాక్టర్ కేశవులు సమాచార హక్కు చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న కేశవులు, సభ్యులను చీఫ్ కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శునకాలతో హడల్

● గ్రామసింహాల స్వైరవిహారం ● భయాందోళనలో ప్రజలు

మర్రిగూడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గ్రామసింహాలు ప్రజలపై దాడులతో వణికిస్తూ, స్వైరవిహారం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల్లో శునకాల సమస్య జఠిలంగా మారింది. వీధి కుక్కలపై నియంత్రణ చర్యలు లేకపోవడంతో పల్లెల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. భారత జంతువుల సంరక్షణ బోర్డు నియంత్రణకు నిబంధనలు విధించింది. ఈ నిబంధనల కారణంగా వీధి కుక్కలను చంపకపోవడంతో వీధి కుక్కలు పలు గ్రామాల్లో నాలుగు వేలకు పైగా ఉన్నట్లు అంచనా. గ్రామాల్లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలపై వాహనదారులపై చిన్నపిల్లలపై ఎగబడి తీవ్రంగా కరుస్తూ దాడి చేస్తున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. కుక్కకాటుకు గురైన బాధితులు చికిత్స కోసం నిత్యం ఆస్పత్రికి వెళ్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ వీధి కుక్కలు ప్రధాన కూడలి వద్ద, చికెన్, మటన్ సెంటర్ల వద్ద, గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. ఈ చికెన్, మటన్ సెంటర్ల వద్ద వ్యర్థ పదార్థాలు అక్కడ పడివేయడం వల్ల కుక్కలు వ్యర్థ పదార్థాలకు అలవాటు పడి స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని వల్ల ప్రజలు అక్కడి నుంచి వెళ్లాలంటే పలు ఇబ్బందులు గురవుతున్నామని వెల్లడిస్తున్నారు. వీధి కుక్కల బారిన పడకుండా వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేయకుండా చర్యలు తీసుకొని వాటిని వేరే చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.


మర్రిగూడలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

కుక్కల బారినుంచి కాపాడాలి



మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నా యి. స్వైరవిహారం చేస్తూ ఇవి ప్రజలను కరుస్తూ దాడులు చేయడం వల్ల కుక్కకాటుకు గురై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ముఖ్యంగా చికెన్, మటన్, సెంటర్ల వద్ద నిఘా ఏర్పాట్లు చేయాలి. కుక్కలను నియంత్రించి వే రే చోటికి తరలించి ప్రజలను వీధి కుక్కల బారి నుంచి రక్షించాలి.

- బూరుగు నాగరాజు, మర్రిగూడ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : వీరేశం


ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల, అవురవాణి గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల కాలంలో ఒక్క పేదవానికి ఇల్లు కట్టివ్వలేదని, కనీసం కట్టిన డబుల్ బెడ్రూంలను కూడా పంపిణీ చేయలేని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, నట్టు సత్తయ్య, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నేతకాకి కృష్ణయ్య, బొడిగె స్వామి, నర్సింహ, పుల్లెంల అచ్చాలు, సమద్, ఎంపీడీవో ఉమేష్‌చారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

కట్టంగూరు: కట్టంగూరు మండలంలోని గంగదేవిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సుమారు 50 మంది ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, మాజీ సర్పంచ్ బెజవాడ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

నార్కట్‌పల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన బోనాల ఊరేగింపు ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. ఎల్లమ్మ కల్యాణం అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. కాగా డీజే పాటలు, సంప్రదాయ డోలు బాజాల మధ్య నృత్యాలు, పోతురాజు, ఎల్లమ్మ, కాళికామాత వేషధారణలో కళాకారుల ప్రదర్శన, శివసత్తుల ఆటపాటలు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు కూడా తన్మయత్వంతో ఊగిపోయారు. అనంతరం ఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు గురిజ అశోక్ స్వామి, రామచంద్రు, క్రాంతి, సిద్దగోని స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశసేవకు పునరంకితం కావాలి

నల్లగొండటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కేడెట్లు దేశ సేవకు పునరంకితం కావాలని కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. పోలీస్ శిక్షణ కేంద్రం వేదికగా ఎన్‌సీసీ కేడెట్ల పది రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేడెట్లు ఉత్తమ క్రమశిక్షణ, ఆచరణాత్మక దేశభక్తికి ఉదాహరణగా నిలవాలన్నారు. పది రోజుల శిక్షణలో అందిపుచ్చుకున్న నైపుణ్యాలను దేశ సేవకు వినియోగించాలని సూచించారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నుంచి పది మంది బాలురు పది మంది బాలికలు ఈ శిక్షణ తరగతులకు హాజరైనట్లు ఎంజీయూ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ మచ్చేందర్ తెలిపారు. ఈ సందర్భంగా కేడెట్లను ఉపకులపతి ఆచార్య ఖాజీ అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.సుధారాణి అభినందించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ మాధవరావు, మల్లయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయిన మహేందర్‌రెడ్డి

కేతేపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. మండల కేంద్రం కేతేపల్లికి చెందిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి గురువారం ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జిని ఆమె క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. మధ్యాహ్నం టీ బ్రేక్‌లో నటరాజన్‌తో భేటీలో కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. పార్టీ కోసం పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఇన్‌చార్జి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆమె సూచించినట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రా వడానికి రైతుల పక్షాన ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించి ప్ర స్తుతం కేసులు ఎదుర్కొంటున్న కిసాన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు జిల్లా, రా ష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో గాని, పార్టీ పదవుల్లోగాని స్థానం కల్పించాలని తాను చేసిన వినతికి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన గోదాములు

● నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే సామేలు


శాలిగౌరారంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోదాము

శాలిగౌరారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం పోలీస్‌స్టేషన్ పక్కన రూ.90 లక్షల నాబార్డు నిధులతో సింగిల్‌విండో భవనం, గోదాములు నిర్మించారు. ఈ భవన నిర్మాణ పనులు పూర్తయి దాదాపు ఆరు నెలలు కావస్తుంది. సింగల్‌విండో భవన కార్యాలయంలోనే దుకాణ సముదాయలను నిర్మించారు. పక్కనే 500 మెట్రిక్ టన్నుల గోదామును కూడా నిర్మించారు. ఈ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ తాల్లూరి మురళి, సీఈవో అంజనేయులు తెలిపారు. మండలంలోని అంబారిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని కూడా శుక్రవారం ఎమ్మెల్యే సామేలు ప్రారంభిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారని తెలిపారు. ప్రారంభిస్తారని తెలిపారు. మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నజీరుద్దీన్ తెలిపారు. అన్ని గ్రామాల లబ్ధిదారులు సకాలంలో హాజరై నూతన రేషన్ కార్డులను పొందాలని కోరారు.

నరసింహ మృతికి కారణమైన

పోలీసులను సస్పెండ్ చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

రామగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): రావెళ్ల నరసింహ మృతికి కారణమైన వన్‌టౌన్ ఎస్ఐ సైదులుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన రావెళ్ల నరసింహను ఎస్ఐ సైదులు సూటిపోటి మాటలతో దూషించడం వల్లే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. డీఎస్పీ స్థాయి అధికారితో మూడు రోజుల్లో విచారణ చేపట్టి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

కిచెన్ గార్డెన్ ఏర్పాటు

మర్రిగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెర బీమనపల్లి మండలంలోని దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బిట్టు శ్రీను, హెచ్‌ఎం ఉదావత్ లచ్చిరాం విద్యార్థులతో కలసి కూరగాయల విత్తనాలను నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీను మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు మంజులత, సభావత్ వెంకట్‌కుమార్ నా యక్, కొండ శ్రీనివాస్, మీన, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయతీపరులను గెలిపించాలి

నార్కట్‌పల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు నిజాయతీపరులను గుర్తించి వారిని గెలిపించాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పీఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు నిజమైన సేవ చేయగలిగే వారినే ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో పీఆర్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్ గోపాల్, నాయకులు ఉయ్యాల లింగస్వామి, బొబ్బలి లక్ష్మారెడ్డి, నన్నూరి శంకర్‌రెడ్డి, మహేశ్వరం సుధాకర్, మామిడి సతీష్, బర్రె సంజీవ, గ్యార సాలయ్య, రాంబాబు, సతీష్, లింగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే లక్ష్యసాధనకు మార్గం

శాలిగౌరారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మంచి అలవాట్లు, సమయపాలన, ఆత్మవిశ్వాసంతోనే ప్రతీ ఒక్కరూ లక్ష్యాలను సాధిస్తారని మోటివేటర్ స్పీకర్లు నూనే సుదర్శన్, దెండే ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్, శాలిగౌరారంలోని కేజీబీవీలో విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యారాణి, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో కె.లలిత, లయన్స్ గ్యాట్ జిల్లా లీడర్ ఎర్ర శంభు లింగారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూపు

(5వ పేజీ తరువాయి)

పడుతున్న పరిస్థితి నెలకొంది. డివిజన్‌లో ట్రిపుల్ కండక్టర్లు 65,785 మీటర్లకు, ఎల్‌టీ ఏబీ కేబుల్ 92వేల మీటర్లు అవసరం. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 248 అవసరం కాగా, అందుబాటులో లేక రైతులకు సరఫరా చేయలేదు. మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి ఉంది. దీనికి ప్రభుత్వం ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోని సకాలంలో సామగ్రి అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీనియార్టీ ప్రకారంగా సామగ్రి సరఫరా

వ్యవసాయ కనెక్షన్లు, ఇతర కనెక్షన్లకు జాప్యం లేకుండా అనుమతులు ఇస్తున్నాం. కనెక్షన్ల పెండింగ్ సహజమే. ప్రత్యేకంగా సామగ్రి కొరత ఏమీ ఉండదు. సీనియార్టీ ప్రకారం వచ్చిన దరఖాస్తులకు సామగ్రి, వ్యవసాయ, ఇతర కనెక్షన్లకు ఇస్తున్నాం. ఇటీవల వచ్చిన సామగ్రిని వచ్చినట్లే రైతులకు అందజేస్తున్నాం. తప్పనిసరిగా అవసరం ఉన్న చోట, లోవోల్టేజీ ఉన్న చోట తప్పకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తాం. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

-వెంకటేశ్వర్లు, ఎస్ఈ, టీజీఎస్‌పీడీసీఎల్

ఆశాలకు కనీస వేతనాలు నిర్ణయించాలి


ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సత్తయ్య

నల్లగొండరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆశాలకు పారితోషకాలు కాదు కనీస వేతనాలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. నల్లగొండ మండలంలో గురువారం రాములబండ పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు జరిగే విధంగా అందరికీ వైద్య సౌకర్యం అందుబాటులో ఉండే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో మురికివాడలో పనిచేస్తున్నారని అన్నారు. దొడ్డి కొమరయ్య భవన్‌లో 3వ తేదీన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ. 18 వేల వేతనం అమలు చేయాలని, ఏఎన్ఎం విద్యార్హత కలిగిన ఆశాలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. యూనిఫాం బకాయిలు, ట్రావెలింగ్ అలవెన్సులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు అవుట రవీందర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భారతి, మంగమ్మ, సంతోష, తేజేశ్వరి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

కనగల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కనగల్ ఎక్స్‌రోడ్డులోని భూనీల సమేత శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి తిరుకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణలు, మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణానికి ఆలయ శాశ్వత ధర్మకర్త బుసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-రమ దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం జరిగిన స్వామివారి పల్లకి ఊరేగించారు. కల్యాణ అనంతరం దాతల సహకారంతో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ చిట్ల లింగయ్యగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, యాదవరెడ్డి, నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, సుధీర్‌రెడ్డి, పాలకూరి పెద్దులు, నీలకంఠం శంకర్, వెంకన్న, పాలకూరి పెద్దులు, శంకరయ్య, ఈశ్వరయ్య, శంకర్, గణేష్, ఆవుల శంకర్, మారయ్య, రాంబాబు, అర్చకులు పాల్గొన్నారు.

రణభేరి సభను విజయవంతం చేయాలి

కనగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆగస్టు 3వ తేదీన వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కొత్తమాసు ప్రభాకర్ కోరారు. గురువా రం కనగల్ మండల కేంద్రంలో రణభేరి సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మా ట్లాడారు. జనాభా దామాషా ప్రకారం ఆర్యవైశ్యులకు స్థానిక ఎన్నికల్లో వాటా కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆర్యవైశ్య కమీషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. వైశ్యబంధును ప్రభుత్వం ప్ర కటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు ఉప్పల మారయ్యగుప్త, బూర్గు వెంకటేశ్వర్లు, ఉపేందర్, పందిరి శ్రీధర్, మిర్యాల నరేందర్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

చిట్యాలరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీలో సరఫరా చేసే యూరియాను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు అధ్యక్షుడు అరూరి శ్రీశైలం డిమాండ్ చేశారు. మండలంలోని వెలిమినేడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి అందించాల్సిన యూరియాను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు బొంత రామకృష్ణారెడ్డి, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాతి శ్రీను, పైళ్ల రఘుమారెడ్డి, దేవిరెడ్డి సందీప్‌రెడ్డి, కూరాకుల విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'హెడ్‌మాస్టర్ అవినీతిపై విచారణ చేయాలి'

చిట్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): చిట్యాల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సుమారు రూ.7లక్షల మేర అవినీతి జరిగిందనీ దీనికి బాధ్యురాలైన హెడ్ మాస్టర్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా సెలవు పెట్టకుండా, ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా హెచ్ఎం పాఠశాలకు గైర్హాజరయ్యారని తెలిపారు. హెచ్ఎం కారణంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. అక్రమాలపై కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్రా సైదానాయక్, కుంచం కావ్య, ముస్కు రవీందర్, కొరె రమేష్, స్పందన, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

నల్లగొండరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పూనెం లింగన్న స్ఫూర్తితో ఆపరేషన్ కగార్ వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ అన్నారు. పట్టణంలోని శ్రామిక భవన్ గురువారం న్యూడెమోక్రసీ సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అజ్ఞాత దళ కమాండర్ పూనెం లింగన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగన్న విప్లవోద్యమంలో అలుపెరుగని పోరాటాలు నిర్వహించి, పేదల కోసం నిరంతరం శ్రమించాడని తెలిపారు. అటవీ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నాయని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ పరం చేశారని దుయ్యబట్టారు.

మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ, నిత్యావసర ధరలు పెంచి పేదలపై పన్నుల భారం వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బొమ్మిడి నగేష్, బొరెడ్డి సత్తిరెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు రావుల వీరేష్, కత్తుల చంద్రశేఖర్, కల్లూరి అయోధ్య, బొమ్మపాల అశోక్, తాలూకా వెంకన్న, మందడి శేఖర్‌రెడ్డి, యశోద, వెంకన్న, స్వామి పాల్గొన్నారు.


పవర్‌ప్లాంట్‌లో నియామకాల పూర్తి ఎన్నడో?

(5వ పేజీ తరువాయి)

నిర్వాసితులకు సంబంధించి 573 మందిని అర్హులుగా గుర్తించిన గత ప్రభుత్వం వారికి ఉద్యోగ హామీ కార్డులు (జాబ్‌కార్డులు) జారీ చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక పవర్‌ప్లాంటు పనులు కొలిక్కి వస్తున్న క్రమంలో మొదటిదశలో ఇళ్లు, భూములు రెండూ కోల్పోయిన వీర్లపాలెం శివారు గిరిజనతండాలైన మోదుగులకుంట, కపూర్‌తండాలలోని 173కుటుంబాలకు సంబంధించి అర్హుల జాబితాను తయారు చేశారు. వారిలో 40 కుటుంబాల వారు తమ కుటుంబంలో ఉద్యోగాలు చేసే వ్యక్తులు లేనందున ఉద్యోగం వదులుకుంటే వచ్చే రూ.5 లక్షల పరిహారం తీసుకున్నారు. మిగిలిన 133 కుటుంబాలకు సంబంధించి 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలివ్వగా వారు శిక్షణలో ఉన్నారు. ఇళ్లు కోల్పోయి ఉద్యోగార్హత కలిగిన మరో 21 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా ఇంకా ఉద్యోగాల నియామకపత్రాలు ఇవ్వలేదు. వీరితో పాటుగా పవర్‌ప్లాంటు నిర్మాణంలో భూములు మాత్రమే కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం (కొత్తపల్లి), తిమ్మాపురం గ్రామాలకు చెందిన మరో 440 కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగమిస్తామని జాబ్‌కార్డులు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా వీరికి కూడా భూములిచ్చి త్యాగం చేసినందుకు కృతజ్ఞతగా ఉద్యోగాల హామీ నెరవేరుస్తామని డిప్యూటీ సీఎం, మంత్రులు స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ కుటుంబాల్లో అర్హులకు సంబంధించిన వారసత్వ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్ నేతృత్వంలో నిర్వహించి జాబితాను కొలిక్కి తెచ్చారు. భూనిర్వాసితుల్లోనూ దాదాపు 96 కుటుంబాల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో తాము ఉద్యోగం కోసం ఎవరికి సిఫార్సు చేస్తున్నారో ఆ వివరాలు ఇవ్వలేదని తెలుస్తోంది. వాస్తవానికి జూన్ మొదటివారంలోపే ఈ వెరిఫికేషన్ పూర్తవడంతో, అదే నెలలో భూనిర్వాసిత కుటుంబీకులకు సైతం ఉద్యోగ నియామకాలు పూర్తవుతాయని ఆశించినప్పటికీ ప్రక్రియ జాప్యమైంది. దీంతో తాజాగా ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలోనైనా ఉద్యోగాల నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారని నిర్వాసిత కుటుంబీకులు ఆశిస్తున్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న నిర్వాసితులకూ ఉద్యోగాలివ్వాలనే డిమాండ్

పవర్‌ప్లాంటులో సేకరించిన భూముల్లో అటవీభూముల్లో పట్టాలు పొందిన (ఆర్‌వోఎఫ్‌ఆర్) గిరిజనులకు భూపరిహారమైతే ఇచ్చారు. కానీ వారికి ఉద్యోగాలిచ్చే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ భూములు కోల్పోయిన రైతులు మరో 290మంది వరకు ఉన్నారని చెబుతున్నారు. ఈ భూములు కోల్పోయిన కుటుంబీకుల వారు సైతం తమ కుటుంబాల్లో అర్హులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకి వినతిపత్రాలు అందజేశారు అంతేకాక ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీ.లక్ష్మారెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు. వీరికి ఉద్యోగాలిప్పించడం ద్వారా నిర్వాసితులందరికీ తరతమ భేదం లే కుండా న్యాయం చేసినట్లవుతుందని, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే నిర్వాసితులకు హామీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా భూనిర్వాసితులకు ఉద్యోగాలిచ్చే విషయంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్టం 33.0
కనిష్టం 24.4
ANDHRAJYOTHY


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585 (297.4350)	2,43,409	2,43,409
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.02 (3.94)	464.69	644.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.291 (40.2110)	2,14,653	2,14,653

చికెన్ ధరలు	లైవ్ : రూ.144	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.245



విద్యుత్ కనెక్షన్ల కోసం
ఎదురుచూపు

- వ్యవసాయ కొత్త కనెక్షన్లకు భారీగా డిమాండ్
- ఉమ్మడి జిల్లా సమీక్షలో ప్రస్తావించిన మంత్రి కోమటిరెడ్డి
- నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 20వేల వరకు డిమాండ్
- సామగ్రి కొరతతో రైతుల అవస్థలు
- ప్రత్యేక దృష్టిసారిస్తేనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం

వ్యవసాయ సీజన్ ఆరంభం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏటేటా పెరుగుతున్నా, కనెక్షన్ల కోసం రైతులు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నా విద్యుత్‌శాఖ నుంచి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, సర్వీసు కనెక్షన్లు మంజూరు కావడంలేదు. కొత్త సర్వీసులకు అవసరమైన విద్యుత్ స్తంభాలు సైతం సకాలంలో అందించకపోవడంతో రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాలో విద్యుత్ పరికరాల సరఫరా జాప్యంపై అధికారులను ప్రశ్నించడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

నల్లగొండతో పాటు సూర్యాపేట జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, వారందరికీ వేగంగా కనెక్షన్లు ఇవ్వాలని ఇటీవల నల్లగొండ జిల్లాలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో డిమాండ్‌పై టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీతో తాను సైతం చర్చించి త్వరగా పనులయ్యేలా చూస్తానని ఇన్‌చార్జిమంత్రి లక్ష్మణ్‌కుమార్ సైతం ప్రకటించినా పరిస్థితి ఎక్కడి గొంగళి అక్కడిలానే ఉంది. తాజాగా, శుక్రవారం ఇంధనశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ సమస్యను మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏడాదిగా భారీగా పెండింగ్

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఏడాది కాలంగా వర్క్ ఆర్డర్లు మంజూరైనా సామగ్రి లేక పెండింగ్‌లో ఉన్నాయి. రెండు జిల్లాల్లో సుమారు 20వేల వరకు వ్యవసాయ ఆధారిత నూతన కనెక్షన్లు పెండింగ్‌లో ఉండగా, నల్లగొండ జిల్లాలో 10వేల వరకు వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో సైతం దాదాపు ఇదే పరిస్థితి ఉంది. రెండు వీటిల్లో రెండు జిల్లాల్లో ఆరువేల పైచిలుకు కనెక్షన్లకు వర్క్ ఆర్డర్లు ఇచ్చినా సామగ్రి ఇవ్వాల్సి ఉంది. వీరంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సామగ్రి లేకపోవడంతో సరఫరా చేయలేకపోతున్నామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. అయితే వచ్చే సమాగ్రిని సిఫారసు లేఖలు ఉన్నవారికి, పైరవీలతో వచ్చినవారికి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్టోర్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ ఏబీ కేబుళ్లు, ట్రిపుల్‌ఏ-కండక్టర్లు, త్రీఫేజ్ 26కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవని అధికారులను సమాధానం వస్తోంది. రెండు జిల్లాల్లో వర్క్ ఆర్డర్లు వచ్చిన కనెక్షన్లకు సంబంధించి సైతం సామగ్రి ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాలకు సుమారు దాదాపుగా 4లక్షల మీటర్ల ఎల్టీ ఏబీ కేబుల్ అవసరం. అదేవిధంగా ట్రిపుల్‌ఏ-కండక్టర్లు 4.50లక్షల మీటర్లకు, త్రీఫేజ్ 26 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 1,100 అవసరం కాగా, అవి అందుబాటులో లేవని సమాధానం వస్తోంది. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి 100 కేవీ, 50కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 300వరకు అదనంగా అవసరం. వీటికోసం ప్రతిపాదించినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదని డివిజనల్ అధికారులు రైతులకు సమాధానమిస్తున్నారు.

నల్లగొండ డివిజన్‌లో అత్యధిక డిమాండ్

నల్లగొండ డివిజన్‌లో బోరుబావుల వ్యవసాయం ఎక్కువగా ఉండడంతో ఇక్కడ రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీలు తీసి ఎదురుచూస్తున్నారు. వర్క్ ఆర్డర్లు సైతం వచ్చినా సామగ్రి ఇవ్వకపోవడంతో ఇబ్బంది

మిగతా 8వ పేజీలో...



పవర్‌ప్లాంట్‌లో నియామకాల పూర్తి ఎన్నడో?

- జాప్యంపై నిర్వాసితుల్లో ఆందోళన
- తొలిదశలో ఇళ్లు కోల్పోయిన 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలు
- మరో 365 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి
- జూన్‌లోనే ఉత్తర్వులు వస్తాయని ఆశించినా దక్కని ఫలితం
- ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న నిర్వాసితులకూ ఉద్యోగాలివ్వాలనే డిమాండ్

నల్లగొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో భూములు కోల్పోయిన నిర్వాసితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ అయినా, ఈ ప్లాంటుతో ఆర్థికంగా భారమైనా పవర్‌ప్లాంటుకు భూములు, ఇళ్లు ఇచ్చి త్యాగం చేసిన నిర్వాసితులపై మానవీయ కోణంతో వ్యవహరిస్తామని, భూములు కోల్పోయిన వారికి ఇంటికో ఉద్యోగమిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్లాంటును తొలిసారి సందర్శించిన సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తొలివిడతలో ఇళ్లు కోల్పోయిన గిరిజన కుటుంబాలకు చెందిన 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. ఆ తర్వాత ఉద్యోగ నియామక ప్రక్రియ జాప్యమవుతుండటంతో రెండోదశలో ఉద్యోగాలు పొందాల్సిన భూనిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం పవర్‌ప్లాంటులో మొదటి యూనిట్‌ని జాతికి అంకితం చేయడంతో పాటు, ప్లాంటులో నిర్మించతలపెట్టిన టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన నిమిత్తం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఈ సందర్భంగానైనా ఉద్యోగాలిచ్చే అంశంపై స్పష్టమైన హామీ ఇస్తారనే ఆశ నిర్వాసితుల్లో వెల్లడవుతోంది.

దఫదఫాలుగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో ఉద్యోగాలిస్తామనే హామీ మేరకు ఇళ్లు, భూములు కోల్పోయిన

మిగతా 8వ పేజీలో...

నేడు థర్మల్ యూనిట్‌ను ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం

దామరచర్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్లపాలెం శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పరిశ్రమలోని యూనిట్-1ను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి భారీ నీటిపారుదలశాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరుకానున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్న ఐదు యూనిట్లు ఉండగా, ఇప్పటికే యూనిట్-2ను ఈ ఏడాది మొదట్లో సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మొదటి యూనిట్ సైతం నాలుగు నెలల క్రితం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రమంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి కేబుల్ వ్యవస్థకు నష్టం వాటిల్లింది. దీంతో యూనిట్-1 ప్రారంభం ఆలస్యమైంది. ఎట్టకేలకు పనులు పూర్తి చేసిన అధికారులు ప్రారంభానికి సిద్ధం చేశారు. మిగిలిన మరో మూడు యూనిట్ల పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా ఉద్యోగుల కోసం నిర్మించనున్న టౌన్‌షిప్‌కు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, ఇక్కడికి 11గంటలకు చేరుకొని టౌన్‌షిప్‌నకు శంకుస్థాపన చేస్తారు. 11.45 గంటల ప్రాంతంలో యూనిట్-1ను ప్రారంభించి 800 మెగావాట్ల విద్యుత్‌ను జాతికి అంకితం చేస్తారు. 12.10గంటల వరకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశ్రమ అభివృద్ధి పనులను మంత్రులకు అధికారులు వివరించనున్నారు. అనంతరం 2.45గంటలకు మంత్రులు తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో రికార్డులను తనిఖీచేస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిర్దేశించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యం ప్రగతిలో ప్రధానంగా ఇప్పటివరకు పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎక్కడ, ఎవరి తప్పిదాలు లేకుండా పారదర్శకంగా లక్ష్యం పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం చూపిన మర్రిగూడ ఎంపీడీవోకు అప్పటికప్పుడే షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వచ్చే సోమవారం నాటికి డివిజన్ పరిధిలో ఇళ్ల నిర్మాణంలో 50శాతం లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో వెంకటయ్య, గృహనిర్మాణ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో శ్రీదేవి, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఐకేపీ ఏపీఎంలు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు పాల్గొన్నారు.

సెల్ లైట్ వెలుగులో హాస్పిటల్ తనిఖీ

మునుగోడు పీహెచ్‌సీ కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో వివిధ గదులను పరిశీలించారు. అనంతరం వివిధ రికార్డులను తనిఖీ చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొద్ది సేపటి వరకు విద్యుత్ సరఫరా రాకపోవడం, ఆస్పత్రిలో ఇన్వర్టర్ ఉన్నా, లైట్ వెలగకపోవడంతో సిబ్బంది సెల్ లైట్ వేశారు. ఆ వెలుగులోనే రికార్డులను కలెక్టర్ తనిఖీచేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎన్.నరేష్, ఎంపీడీవో ఎం.విజయ్‌భాస్కర్ ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నర్సింగ్ కళాశాల భూమి పూజలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో రూ.40కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో తాగునీటి ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో విద్య, నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్య సదుపాయాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లతో సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, రూ.20వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంజీయూలో రూ.100కోట్లతో భవనాలు నిర్మించామని, ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇటీవల ఎల్‌ఎల్‌బీ, ఎంఫార్మసీ, కోర్సులు, భవనాలు సీఎం మంజూరు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో విద్యాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని విమర్శించారు.

వైద్యరంగ బలోపేతానికి చర్యలు

జిల్లాలో వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అభివృద్ధి చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి నూతన వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాల కోసం అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే రూపొందించి సమర్పించాలన్నారు. త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

జిల్లా కేంద్రంలోని గంధవారిగూడెం వద్ద రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఈ నెల 4న భూమిపూజ చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నమూనా, నిర్మాణ పనులపై సమీక్షించారు. నల్లగొండ రెసిడెన్షియల్ పాఠశాలను రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. 5.58లక్షల అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో తొమ్మిది వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్స్, 3,000 మందికి ఒకేసారి భోజనాన్ని వండేలా వంటగది, 1,280 మంది ఒకేసారి భోజనం చేసేలా డైనింగ్ హాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మంత్రి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో మొక్క నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన రిషికేశ్ పిడుగుపాటుకు మృతి చెందగా, అతడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌నారాయణ్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, పాల్గొన్నారు.

సాంకేతికతతో కచ్చితమైన ఫలితాలు



క్లూస్‌టీం మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం క్లూస్ టీమ్‌కు కేటాయించిన నూతన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. నేరం జరిగిన ప్రదేశానికి క్లూస్ టీమ్ త్వరగా చేరుకొని, నమూనాలను సేకరణకు ఈ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. నూతన సాంకేతిక టెక్నాలజీతో డీఎన్‌ఏ శాంపిళ్ల సేకరణ, రక్త, తదితర నమూనాల సేకరణ, ఇతర ఆధారాలను భద్రపరిచే ఫోరెన్సిక్ సేఫ్ డ్రాయింగ్ క్యాబినెట్ లాంటి అన్ని సదుపాయాలు ఈ వాహనంలో ఉన్నాయన్నారు. ఎక్కడైనా హత్యలు, అత్యాచారాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు ఈ వాహనంలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవచ్చన్నారు. అన్ని సదుపాయాలు ఉన్న ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో ద్వారా నేర పరిశోధన సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్బీ సీఐ శ్రీనునాయక్, ఆర్‌ఐలు సూరప్పనాయుడు, సంతోష్, నరసింహ, క్లూస్ టీమ్ ఇన్‌చార్జి ఎస్‌ఐ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాను సాగుకు మాత్రమే వినియోగించాలి

డీఎస్పీ శివరాంరెడ్డి



ఏడీబ్లూ డీఈఎఫ్ కేంద్రాన్ని తనిఖీచేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాలరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాయితీ యూరియాను వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి హెచ్చరించారు. చిట్యాల మండలం వెలిమినేడులో ఏడీబ్లూ డీఈఎఫ్ కేంద్రాన్ని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్‌తో కలిసి ఆయన తనిఖీచేశారు. తయారీ కేంద్రంలో ఉన్న యూరియా బస్తాలను, ఆయిల్ తయారీ విధానాన్ని నిల్వ చేసిన ఆయిల్‌ను పరిశీలించారు. మరో ప్రాంతంలో నిల్వ చేసిన యూరియా బస్తాలను, విక్రయించేందుకు ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. వీటి నిర్వహణ తీరు, తయారీ గురించి నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు డీఎస్పీకి వివరించారు. రాయితీ యూరియాతో పాటు ఇండస్ట్రియల్ యూరియాతో ఆయిల్‌ను తయారు చేస్తున్నారని, అలా చేయకూడదని అన్నారు. పంటల సాగుకు రైతులు పంటపొలాల్లో చల్లే యూరియాను అడ్డదారిలో కొనుగోలు చేసి ఆయిల్‌ను తయారు చేసి విక్రయిస్తున్నారన్నారు. రాయితీ యూరియాను కేవలం వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని ఇతరత్రా అవసరాలకు ఎట్టిపరిస్థితుల్లో కూడా వినియోగించవద్దన్నారు. రాయితీ యూరియాను అక్రమంగా తరలించడం నేరమన్నారు. రాయితీ యూరియాను అక్రమంగా తరలించినా, నిల్వచేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి

నల్లగొండ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వసతి గృహ సంక్షేమ అధికారుల డైట్ బడ్జెట్, బిల్లులు పరిష్కారం కోసం కృషి చేస్తామని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. గురువారం టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహ సంక్షేమ అధికారుల డైట్ బడ్జెట్, బిల్లులు త్వరగా మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. వసతి గృహ సంక్షేమ అధికారుల పదోన్నతి విషయాన్ని టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం సహకారంతో పరిష్కరిస్తానని తెలిపారు. నూతన వసతి గృహ సంక్షేమ అధికారులు సభ్యత్వం నమోదు చేసుకోవాలని, రెవెన్యూ డివిజన్ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రణదివె, కార్యదర్శి ఏ.సత్యనారాయణ, టీఎన్జీవోస్ ఉపాధ్యక్షురాలు రమ్య సుధా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

దేవరకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బూత్ అధ్యక్షుడు ఎంపీటీసీ స్థానాల్లో పోటీచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, వీరెళ్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఏటీ కృష్ణ, సురేష్, నక్క వెంకటేష్ యాదవ్, చెనమోని రాములు, వనం నరేందర్‌రెడ్డి, వినోద్, రాథోడ్, అంకూరి నరసింహ, వస్కుల సుధాకార్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



దేవరకొండ సీఐగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు

దేవరకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి):దేవరకొండ సీఐగా పి.వెంకట్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన నరసింహులు హైదరాబాద్‌కు బదిలీయ్యారు. ఆయన స్థానంలో నల్ల గొండ బీసీఆర్‌బీలో పనిచేస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి దేవరకొండకు బది లీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రత లకు పరిరక్షణకు కృషి చేస్తానని అందరూ సహకరించాలన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మిర్యాలగూడ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు అన్నారు. పట్టణంలోని కేవీ రంగాచార్యులు రంగనాయకమ్మ లయన్స్‌క్లబ్ కంటి ఆస్పత్రిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య వ్యాయామం చేస్తూ, ఉప్పు, చెక్కర మితంగా తీసుకోవాల న్నారు.కార్యక్రమంలో డాక్టర్ ప్రనూష, ఆస్పత్రి చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వర్లు, సంతోష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో 'స్థానిక' సందడి

- ప్రధాన పార్టీల నాయకుల జోరుగా సమావేశాలు
- విజయంపై ఎవరికి వారే ధీమా

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

దేవరకొండ నియోజకవర్గంలో స్థానిక సంస్థల సందడి ప్రారంభ మైంది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మునిసిపల్ ఎన్నికలు కూడ నిర్వహించేందుకు కసరత్తు జరుగుతుండడంతో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలలో పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతు న్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీల బలోపేతంతో పాటు గెలుపే లక్ష్యంగా ముం దుకు వెళ్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బాలునాయక్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబా టులో ఉంటు విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ పలు పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తు న్నారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేసి మూడేళ్లలో సాగునీరు అందిస్తా మని తెలుపుతున్నారు. ఇటీవల దేవరకొండలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్ దేవరకొండలో సీసీరోడ్ల శంకుస్థాపనతోపాటు చం దంపేట మండలం పోలేపల్లిలో సభ నిర్వహించి రేషన్‌కార్డుల పంపిణీ చేశా రు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ ముందుకు వెళ్తోంది.




▸▸ ఇక బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ నియో జకవర్గంలో ముఖ్యనాయకులను కలిసి సమావేశాలు నిర్వహించి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రణాళికతో ముందుకు పోతున్నారు. పదేళ్ల కేసీ ఆర్ పాలనలో బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివ రించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ స్థానిక నేతలకు సూచించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మ రించిందని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయా లని డిమాండ్ చేస్తున్నారు.

సీపీఐ ఈనెల 18న దేవరకొండలో జిల్లా మహాసభను నిర్వహించింది.ఈ మహాసభకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గసభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులు మహాసభకు హాజరయ్యారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మినహా కలిసివచ్చే పార్టీలతో స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని వారు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నిక లలో సీపీఐ అత్యధిక స్థానాలు గెలిచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ దేవరకొండ నియోజకవర్గంలో గతంలో కంచుకోటగా ఉండేదని, మళ్లీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఆపార్టీ నాయకత్వం సన్నాహాలు చేస్తుంది.

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తరచుగా దేవరకొండలో పర్య టిస్తూ నియోజకవర్గ బూత్‌స్థాయి నాయకులతో సమావేశాలు నిర్వహిం చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిపించుకోవా లని కార్యకర్తలను కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సంస్థాగతంగా బలోపేతంకావాలని పిలుపునిస్తున్నారు. ప్రాజెక్టులను నిర్మించి సాగునీరు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు దేవర కొండ మునిసిపాలిటీలు అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని పార్టీ నేతలు పిలుపునిస్తు ముందుకు వెళ్తున్నారు. సీపీఎం జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలను పరి ష్కరించాలని కోరుతున్నారు. దీంతో దేవరకొండలో పలు రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించి సంస్థాగతంగా బలోపేతం అయ్యేందుకు సన్నద్ధంమవుతున్నారు. దీంతో దేవరకొండ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. ఎన్నిక లు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండి అత్యధిక స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని ఆయా పార్టీల నేతలు కార్యకర్తలు, నాయకులను కోరుతున్నారు.

నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు

కాంగ్రెస్ నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయం తీసుకోవ డంతో దేవరకొండ నియోజకవర్గంలోని సీనియర్ నాయకులలో ఆశలు చిగురిస్తున్నాయి. నామినేటెడ్ పదవులు తమకే దక్కుతాయని పలు వురు నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నల్లగొండ పార్ల మెంట్ కోఆర్డీనేటర్ ఎంఏ.సిరాజ్‌ఖాన్, సర్పంచుల ఫోరం సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, తాటికోలు మాజీ సర్పంచ్ జూలూరు ధన లక్ష్మి, దేవరకొండ మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్ నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నట్లు దేవరకొండలో ప్రచారం జరుగు తోంది. కాగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి తనకు కేటాయించాలని సీని యర్ కాంగ్రెస్ నాయకులు తిప్పర్తి రుక్మారెడ్డి అధిష్టానాన్ని కోరినట్లు సమాచారం. 40 ఏళ్లుగా పార్టీలో ఉంటూ సేవలు అందించానని అధి ష్టానం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించాలని కోరుతున్నారు. కాగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి రేసులో చందంపేట మండల పీఏసీఎస్ చైర్మన్, పీసీసీ సభ్యుడు జాల నర్సింహరెడ్డి కూడ ఉన్నట్లు దేవరకొండ కాంగ్రెస్ వర్గాలలో ప్రచారం జరుగుతుంది. నామినేటెడ్ పదవులు ఎవ రిని వరించనున్నాయో అధిష్టానం నిర్ణయించవలసి ఉంది.



సాయిసన్నిధిలో ఎమ్మెల్యేలు పూజలు



చింతపల్లి సాయిసన్నిధిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

చింతపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో దేవరకొండ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, బీఎల్‌ఆర్ సాయినాథుని గురువారం దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిమార్గం వల్ల ముక్తి మార్గం పొందవచ్చన్నారు. అనంతరం కమిటీ ఎమ్మెల్యేలను శాలువాతో సన్మానించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, ఎరుకల వెంకటయ్యగౌడ్, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

పెద్దవూర, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీ లను వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్వేదుల గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, పింఛన్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో చెన్ను సుందర్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, సైదులుయాదవ్, దుబ్బ రవి బాబు నాయక్, భీమ్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

శెట్టిపాలెంలో బోనాలు



ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

వేములపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపా లెంలో గురువారం ఊర బోనాలను నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు అనంతరం ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు, నూతన వస్త్రాలను సమర్పించి పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా తమను చల్లంగా చూడాలని భక్తులుమొక్కులను చెల్లించుకున్నారు.

గ్రామ దేవతలకు పూజలు

దేవరకొండ, జూలై 31(ఆద్రజ్యోతి): శ్రావణమాసం పురస్కరిం చుకొని యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మతల్లితో పాటు గ్రామ దేవతలకు పూజలు చేశారు. వర్షాలు కురువాలని పంటలు పండాలని గ్రామ దేవతలకు నీలు పోసే కార్యక్రమం చేప ట్టారు. అనంతరం బోనాలతో ఊరేగించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వెంకటయ్య యాదవ్, సలేశ్వర్ యాదవ్, విజ య్, నక్కా వెంకటేష్ యాదవ్, సైదులు నిరంజన్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుకు అనుమతి ఇవ్వొద్దు

దేవరకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని గిరిజనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనంబర్ 359లో డంపింగ్ యార్డు నిర్మాణాన్ని నిలిపివేసి అనుమతి రద్దు చేయాలని తండావా సులు గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో ధని యాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తండవాసు లు మాట్లాడుతూ తండా సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే దుర్వాసన వస్తుందనిన్నారు. డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని వెంటనే విరమించుకోవాలని తండాకు చెందిన నాగార్జునాయక్, బిక్కయ్య, హనుమా, రూప్లా, తండావాసులు కోరారు.

పెండ్లిపాకల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలి

కొండమల్లేపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెండ్లిపాకల రిజర్వా యర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ ఆధ్వర్యంలో గురు వారం నీటిపారుదల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపెండ్లిపాకల రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా పెండ్లిపాకల, చింతకుంట్ల, చెన్నంనేనిపల్లి, రమావత్‌తండా, ఫకీర్‌పురం, దేశ్‌ముక్‌తండా, పీల్య తండా, వర్ధమానిగూడెం, అచ్చంపేటపట్టి, సింగ్యతండా , గ్రామాల రైతులను ఆదుకున్నట్లవుతుందని అన్నారు. వినతిపత్రం అందజే సిన వారిలో ఎటెల్లి రాంబాబు, నానుబావోజి, అనిల్ అ న్నారు.

'కృష్ణవేణి'లో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు

హాలియా, జూలై31(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని కృష్ణ వేణి పాఠశాలలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ పోస్టులకు నామి నేషన్లు సమర్పించి పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులు తమ ఓటు హక్కును విని యోగించుకొని తమకు ఇష్టమైన అభ్యర్థులకు ఓటు వేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నిమ్మల లక్ష్మారెడ్డి ప్రధానోపాధ్యా యులు రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పీఏపల్లి మండలంలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి,జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కొన మేకలవారిగూడెం స్టేజీ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో గురు వారం లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. రాష్ట్రంలో 84 శాతం మంది ప్రజలకు సన్నబియ్యం అందజేయడం దేశం లోనే చారిత్రాత్మకం అన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు అం దుతాయని, రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ తెలిపా రు. అనంతరం గుడిపల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇళ్లు కోసం ఎంపిక చేసిన కేశంనేనిపల్లి గ్రామాన్ని సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు, వివిధ అను బంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గరిష్ఠ నీటిమట్టం పెంచాలి

మండలకేంద్రానికి చెందిన రైతులు 7బీ కాలువకు నీళ్లు రావ డంలేదని ఏకేబీఆర్ రిజర్వాయర్‌లో గరిష్ఠంగా నీటి నిల్వ చేయ కపోవడంతో నీళ్లు రావడం లేదని అధికారులతో మాట్లాడి రిజ ర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం పెంచి నీటిని విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మె ల్యే నీటిపారుదల అధికారులతో మాట్లాడారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొండమల్లేపల్లి : మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌లో కొత్తగా నిర్మించిన డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారం భించారు. అనంతరం కొండమల్లేపల్లిలోని అంబేద్కర్ కాలనీ, జెపీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా మంచి ఆదరణ వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మా ర్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నాయిని జమునా మాధవరెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంఏ.సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, దూదిపాల రేఖాశ్రీధర్ రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, కుంభం శ్రీనివా వాస్‌గౌడ్, పస్నూరి యుగేందర్‌రెడ్డి, ఎంఏ కైసర్ ఖాన్, మాడ్గుల యాదగిరి, పెద్దిశెట్టి సుధాకర్, మాడ్గుల యాదగిరి పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ

బీసీలకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు ఆమోదించాలని డి మాండ్ చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఆగస్టు 5,6,7 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరులసమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆగస్టు 5న పార్లమెంట్ ఎంపీల ద్వారా వాయిదా తీర్మానం, 6న రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇత ర ప్రజాప్ర తినిధులతో జంతర్‌మంతర్ వద్ద కార్యక్రమం, 7న సీఎం, మం త్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నేతలతో కలిసి రాష్ట్రపతికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

బంజారాల ఐక్యతకు నిదర్శనం తీజ్



తీజ్ వేడుకల్లో పాల్గొన్న స్కైలాబ్‌నాయక్

అడవిదేవులపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఐక్య తకు తీజ్ పండుగ నిదర్శనంగా నిలుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు స్కైలాబ్‌నాయక్ అన్నారు. గురువారం మండలం లోని ఉల్సాయిపాలెం గ్రామం లో బంజారాల సాంస్కృతి, సం ప్రదాయాలకు ప్రతీకైన తీజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభ దశలో గిరిజనులు నిర్వహించే మొట్టమొదటి పండుగ తీజ్ అని బంజారా ఆడబిడ్డలు 9 రోజులు ఎంతో నిష్టతో ఉంటూ వారి జీవితంలో మంచి భర్త రావాలని, పాడి పంటలు సమృ ద్ధిగా పండాలని, గొడ్డుగోదా రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని ఈ పండుగ జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో కొర్ర అశోక్‌నాయక్, లష్కర్, సూక్యానాయక్, విజయ్, లాల గ్రామస్థులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాడ్గులపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): యు వత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌లను నిర్మూ లించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్ యాత్ర గురువారం మ ండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు చేరు కోగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ పా ల్గొని మాట్లాడారు. యువత సన్మార్గంలో నడి చి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోని తల్లి దండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసు కురావాలన్నా- కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, పుల్లెంల శ్రీక ర్, ఊర ఎల్లయ్య, మల్లారెడ్డి, రవి, వెంకన్న, గురు స్వామి, అనిల్, మాధవ్, రాజు, సలీంద్ర తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్

మిర్యాలగూడ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవా లని షీ టీమ్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని కాకతీయ ఉన్నత పాఠశాల విద్యా ర్థులకు గురువారం అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు వాడొ ద్దని, మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉం డాలన్నారు. చదువుపై దృష్టి సారించాలని, తీరి క సమయాల్లో ఆటపాటలను సాధన చేయాల న్నారు.కార్యక్రమంలో చీదళ్ల వెంకట్, షీ టీమ్ బృందం, ప్రభాకర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

జూడో పోటీలు ప్రారంభం

మిర్యాలగూడ టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలు పట్టణంలోని బీసీ భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కోచ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ శ్రీధర్ మా ట్లాడుతూ సబ్ జూనియర్ లెవల్‌లో నిర్వహిస్తున్న పోటీ లకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలిరావడం హర్షణీ యమన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కన బర్చిన క్రీడాకారులను ఆగస్టు 5, 6, 7వ తేదీ ల్లో వరంగల్‌లో నిర్వ హించనున్న పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా పోటీలను మారం శ్రీనివాస్, చేగొండి మురళీ యాదవ్ ప్రా రంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జయరాజు, ఉమాశేఖర్, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నిడమనూరు అధ్యక్షుడిగా అశోక్



లయన్స్ క్లబ్ నిడమనూరు కార్యవర్గం

నిడమనూరు, జూలై 31 (ఆంధ్ర జ్యోతి): లయన్స్ క్లబ్ నిడమనూరు నూతన అధ్యక్షుడి గా బెలిదె అశోక్ ఎన్ని కయ్యారు. మండలంలోని శాఖాపురంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్య దర్శిగా చిత్రం అశోక్, కోశాధికారి వంకా బ్రహ్మన్న, వైస్ ప్రెసిడెంట్‌గా గండికోట యాదగిరి, వైస్ ప్రెసిడెంట్-2గా కాసోజు తిరు పతాచారి చేత క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 కోడే సతీష్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయిం చారు. అలాగే కొత్త సభ్యులతో జిల్లా క్యాబినెట్ కార్యదర్శి చిలుకూరి రామకృష్ణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లా డుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించి నిడ మనూరు క్లబ్‌ను అగ్రభాగాన నిలుపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీజీ-1 కేవీ ప్రసాద్, చేకూరి హనుమంతరావు, అంకతి సత్యం, పోలే డేవిడ్, పాం పాటి శ్రీనివాసులు, కట్టెబోయిన గుర్వయ్య, నందికొండ మట్టారెడ్డి, ఉన్నం చినవీరయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివ మారయ్య, సూరయ్య, మ ధు, నేతాల వెంక టేశ్వర్లు, శివకోటి రాంబాబు, సత్తిబాబు తదితరుఎలు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్‌లో నియామకాల పూర్తి ఎన్నడో?

(5వ పేజీ తరువాయి)

నిర్వాసితులకు సంబంధించి 573 మందిని అర్హులుగా గుర్తిం చిన గత ప్రభుత్వం వారికి ఉద్యోగహామీ కార్డులు (జాబ్‌కా ర్డులు) జారీ చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక పవర్‌ప్లాంటు పనులు కొలిక్కి వస్తున్న క్రమంలో మొదటిదశలో ఇళ్లు, భూములు రెండూ కోల్పోయిన వీర్లపాలెం శివారు గిరిజనతం డాలైన మోదుగులకుంట, కపూర్‌తండాలలోని 173 కుటుంబా లకు సంబంధించి అర్హుల జాబితాను తయారు చేశారు. వారిలో 40 కుటుంబాల వారు తమ కుటుంబంలో ఉద్యోగాలు చేసే వ్యక్తులు లేనందున ఉద్యోగం వదులుకుంటే వచ్చే రూ.5 లక్షల పరిహారం తీసుకున్నారు. మిగిలిన 133 కుటుంబాలకు సంబంధించి 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలివ్వగా వారు శిక్ష ణలో ఉన్నారు. ఇళ్లు కోల్పోయి ఉద్యోగార్హత కలిగిన మరో 21 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా ఇంకా ఉద్యోగాల నియామకపత్రాలు ఇవ్వలేదు. వీరితో పాటుగా పవర్‌ప్లాంటు నిర్మాణంలో భూములు మాత్రమే కోల్పోయిన వీర్లపాలెం, తాళ్ల వీరప్పగూడెం (కొత్తపల్లి), తిమ్మాపురం గ్రామాలకు చెందిన మరో 440 కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగ మిస్తామని జాబ్‌కార్డులు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా వీరికి కూడా భూములిచ్చి త్యాగం చేసినందుకు కృతజ్ఞ తగా ఉద్యోగాల హామీ నెరవేరుస్తామని డిప్యూటీ సీఎం, మంత్రులు స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ కుటుంబా ల్లో అర్హులకు సంబంధించిన వారసత్వ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్ నేతృత్వంలో నిర్వహించి జాబితాను కొలిక్కి తెచ్చారు. భూనిర్వాసితుల్లోనూ దాదాపు 96 కుటుంబాల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో తాము ఉద్యోగం కోసం ఎవరికి సిఫా ర్సు చేస్తున్నారో ఆ వివరాలు ఇవ్వలేదని తెలుస్తోంది. వాస్త వా నికి జూన్ మొదటివారంలోపే ఈ వెరిఫికేషన్ పూర్తవడంతో, అదే నెలలో భూనిర్వాసిత కుటుంబీకులకు సైతం ఉద్యోగ నియామకాలు పూర్తవుతాయని ఆశించినప్పటికీ ప్రక్రియ జాప్య మైంది. దీంతో తాజాగా ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నైనా ఉద్యోగాల నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారని నిర్వా సిత కుటుంబీకులు ఆశిస్తున్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న నిర్వాసితులకూ ఉద్యోగాలివ్వాలి

పవర్‌ప్లాంటులో సేకరించిన భూముల్లో అటవీభూముల్లో పట్టాలు పొందిన (ఆర్‌వోఎఫ్‌ఆర్) గిరిజనులకు భూపరిహార మైతే ఇచ్చారు. కానీ వారికి ఉద్యోగాలిచ్చే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ భూములు కోల్పోయినరై తులు మరో 290 మంది వరకు ఉన్నారని చెబుతున్నారు. ఈ భూములు కోల్పోయిన కుటుంబీకుల వారు సైతం తమ కు టుంబాల్లో అర్హులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి వినతిపత్రాలు అందజే శారు అంతేకాక ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బి.లక్ష్మారె డ్డిపై ఒత్తిడి తెస్తున్నారు. వీరికి ఉద్యోగాలిప్పించడం ద్వారా నిర్వాసితులందరికీ తరతమ భేదం లేకుండా న్యాయం చేసిన ట్లవుతుందని, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేం దుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా ఎమ్మెల్యే నిర్వాసితులకు హామీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా భూనిర్వాసితులకు ఉద్యోగాలిచ్చే విష యంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొని న్యాయం చేయా లని నిర్వాసితులు కోరుతున్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూపు

(5వ పేజీ తరువాయి)

పడుతున్న పరిస్థితి నెలకొంది. డివిజన్‌లో ట్రిపుల్ కండక్టర్లు 65,785 మీటర్లకు, ఎల్‌టీ ఏబీ కేబుల్ 92వేల మీటర్లు అవసరం. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 248 అవసరం కాగా, అందుబా టులో లేక రైతులకు సరఫరా చేయలేదు. మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి ఉంది. దీనికి ప్రభుత్వం ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోని సకాలంలో సామగ్రి అందేలా చర్యలు తీసుకో వాలని రైతులు కోరుతున్నారు.

సీనియార్టీ ప్రకారంగా సామగ్రి సరఫరా

వ్యవసాయ కనెక్షన్లు, ఇతర కనెక్షన్లకు జాప్యం లేకుండా అనుమతులు ఇస్తున్నాం. కనెక్షన్ల పెండింగ్ సహజమే. ప్రత్యేకంగా సామగ్రి కొరత ఏమీ ఉండదు. సీనియార్టీ ప్రకారం వచ్చిన దరఖా స్తులకు సామగ్రి, వ్యవసాయ, ఇతర కనెక్షన్లకు ఇస్తున్నాం. ఇటీవల వచ్చిన సామగ్రిని వచ్చినట్లే రైతులకు అందజేస్తున్నాం. తప్పనిసరిగా అవసరం ఉన్న చోట, లోవోల్టేజీ ఉన్న చోట తప్పకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తాం. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుం టున్నాం.

వెంకటేశ్వర్లు, టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ